J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74

నెల్లూరు, 11.09.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 15 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

## నెల్లూరు ఇక నిల్ ఊరేనా?

### జిల్లాల పునర్విభజనలో...

వెంకటగిరి 'జరీ' జారిపోనుందా

ప్రపంచ ప్రఖ్యాత 'షార్' ఇక మనది కాదా

పారిశ్రామిక 'ప్రగతి' కుంటుపడుతుందా

సిలికాన్, మైకా 'మైనింగ్'లు తరలిపోనున్నాయా

తడ నుండి మైపాడు దాకా 'తీరం' దూరం కానుందా

?

## 'అనాధ'కానున్న నెల్లూరుజిల్లా


మొలగొలుకులు మొలిచిన జిల్లాగా, మొనగాళ్లకు నెలవైన ఖిల్లాగా నెల్లూరుకు పేరుంది. నెల్లూరంటే ఒక సంచలనం, నెల్లూరంటే ఒక సంప్రదాయం, నెల్లూరంటే ఒక శుభసూచకం. ఇక్కడనుండి ఏ పని మొదలుపెట్టినా అది నిరాటంకంగా సాగిపోతుందని ఒక నమ్మకం. నెల్లూరు నుండి ఏ ఉద్యమం మొదలైనా అది లక్ష్యాన్ని సాధిస్తుందన్నది ఒక నానుడి. మహాభారతాన్ని తెలుగులో అనువదించిన మహాకవి తిక్కన నడయాడిన నేల నెల్లూరు. యోధానుయోధులైన రాజకీయ నాయకులు పుట్టిన గడ్డ నెల్లూరు. తిరుమల వెలుపల జరిగిన శ్రీవారి కళ్యాణం, ఊంజల్‌సేవ, పుష్పాభిషేకాలతో పాటు అంగరంగ వైభవంగా జరిగిన వైభవోత్సవాలకు సైతం తొలి వేదికగా ముస్తాబైన పుణ్యభూమి, ధన్యభూమి నెల్లూరే!

ఇప్పుడు ఆ నెల్లూరు జిల్లా ఒంటరి కానుందా...? జవసత్వాలు కోల్పోయి అనాధ కానుందా...? అవుననే అంటున్నాయి మేధావి వర్గాలు. జిల్లాల పునర్విభజన జరిగితే (మిగతా 10వ పేజీలో)



## మన సతీష్‌రెడ్డి.. మరో అద్భుత సృష్టి

భారత రక్షణ, పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఓ) మరో అద్భుత విజయాన్ని సాధించింది. ఎంతో శక్తివంతమైన హైపర్ సోనిక్ టెక్నాలజీ డిమాన్ స్ట్రేటర్ వెహికల్ (హెచ్‌ఎస్‌టిడివి)ను మన సతీష్‌రెడ్డి నేతృత్వంలో విజయవంతంగా పరీక్షించి డిఆర్‌డిఓ చరిత్ర సృష్టించింది. ఈ అత్యంత అధునాతన టెక్నాలజీలో భారత్ కీలక దశను అధిగమించింది. (మిగతా 10వ పేజీలో)



## తప్పని కరోనా పాట్లు

### బాధితులు 3 కోట్లు

కరోనా... ఇప్పుడు లక్షలాదిమందికి కాదు.. ఏకంగా ప్రపంచంలో కోట్లాది మందిని కాటేస్తూ అందరినీ బాధిస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రపంచాన్నే గడగడలాడిస్తోంది. ఈ మాయదారి జబ్బుతో అన్నిదేశాలు అల్లాడిపోతున్నాయి. కరోనా మహమ్మారి వ్యాధి కాటుకు బలైపోతున్నవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూ లక్షలు దాటిపోతోంది. ప్రతినిత్యం కోవిడ్ పాజిటివ్ కేసులు కుప్పలు తెప్పలుగా పుట్టుకొస్తూనే ఉన్నాయి. వయసుతో నిమిత్తం లేకుండా అన్ని వయసుల వారికీ కరోనా అంటుకుంటోంది.

ప్రపంచంలోని మొత్తం 213దేశాల్లో ఈనెల9 బుధవారం నాటికి కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 2కోట్లా78లక్షలా 98వేలా860కి చేరుకుందంటే కరోనా ఉధృతి ఎంత వేగంగా కొనసాగుతోందో అర్ధమవుతుంది. ఈ క్రమంలో మరికొద్ది రోజుల్లోనే కరోనా బాధితుల సంఖ్య మూడు కోట్లకు చేరువవుతూ ఉండడం సర్వత్రా (మిగతా 10వ పేజీలో)



# మల్లాం సుబ్రహ్మణ్యేశ్వరునికి వసంతోత్సవం

జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన చిట్టమూరు మండలం మల్లాం గ్రామంలోని వళ్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల7న స్వామివారికి వసంతోత్సవం వేడుకగా నిర్వహించారు. ఆదివారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం అనంతరం మరుసటిరోజున వసంతోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ఆలయ అర్చకులు శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కరోనా నేపథ్యంలో ఈ కార్యక్రమాలన్నీ నిబంధనల మేరకు ఏకాంతంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ చిల్లకూరు కోదండరామిరెడ్డి, పాలకమండలి సభ్యులు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ పాల్గొన్నారు.

# దేవాలయాలపై దారుణాలను అరికట్టాలి

- మల్లెమాల మురళీరెడ్డి




ఇటీవల తూర్పుగోదావరి జిల్లా అంతర్వేది గ్రామంలో జరిగిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి రథం దగ్ధం సంఘటనపై సిబిఐ విచారణ మరియు న్యాయ విచారణ జరపాలని విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు మల్లెమాల మురళీరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తూ ఆయన మాట్లాడారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, హిందూ భక్తులపై అక్రమంగా పెట్టిన కేసులు తక్షణమే ఉపసంహరించుకొని రథం దగ్ధం కావడానికి కారణమైన దోషులను గుర్తించి అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి సిహెచ్ రమణయ్య, ఉపాధ్యక్షుడు సత్యానందస్వామి, పట్టణ కార్యదర్శి కడివేటి రామమూర్తి, కోశాధికారి రవిచంద్రారెడ్డి, వివిధ క్షేత్రాల కార్యదర్శులు కలిసి సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

## కాలధర్మం

### వొమ్మిన సుబ్రహ్మణ్యం



నెల్లూరుజిల్లా ఛేంబర్ ఆఫ్ కామర్స్ సంస్థ అధ్యక్షులు, సీనియర్ ఆర్యవైశ్య నాయకులు, రొటేరియన్‌గా సుప్రసిద్ధులు, ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చెంట్స్ వ్యవస్థాపకుల్లో ఒకరైన వొమ్మిన సుబ్రహ్మణ్యం(83) ఈనెల 7వ తేది నెల్లూరులో మృతిచెందారు. ఎప్పుడూ చెరగని చిరునవ్వుతో అందరినీ ఆప్యాయంగా పలకరిస్తుండడం, అందరితో కలిసిపోయే వ్యక్తిత్వం ఆయన సొంతం. వ్యాపారవేత్తగా రాణిస్తూ నగరంలో అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారు. సర్వోదయ ఐటిఐని స్థాపించి యువతకు ప్రాధాన్యత నిచ్చి వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇచ్చి వారి జీవనోపాధికి బాటలు వేశారు. వొమ్మిన సుబ్రహ్మణ్యం మృతి పట్ల ఆర్యవైశ్యులు తమ విచారం ప్రకటిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలిపారు. ఆర్యవైశ్య ప్రముఖుడు కెవి చలమయ్య మాట్లాడుతూ వొమ్మిన మరణంతో ఒక మంచి నాయకుణ్ణి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

### కారంశెట్టి వెంకట్రామయ్య




నెల్లూరుజిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు, జిల్లా రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు, కారంశెట్టి వెంకట్రామయ్య ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ, ప్రముఖ ఆర్యవైశ్య నాయకుడు కారంశెట్టి వెంకట్రామయ్య (80) సెప్టెంబర్ 8వ తేది మంగళవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో అనారోగ్యంతో కన్నుమూశారు. సర్వోదయ ఎడ్యుకేషన్ కమిటీ ఛైర్మన్‌గా కూడా కారంశెట్టి ఎనలేని సేవలందించారు. నిగర్వి, సౌజన్యశీలిగా, సేవా తత్పరుడుగా వెంకట్రామయ్య నెల్లూరులో అందరికీ తెలిసినవారే. నెల్లూరులో లక్ష్మీ ఇంజనీరింగ్ షాప్ యజమానిగా ఆయన వ్యాపారరంగంలో కుదురుకున్నారు. కారంశెట్టి వెంకట్రామయ్య ఫౌండేషన్‌ను స్థాపించి విద్యలో ప్రతిభతో రాణించే విద్యార్థినీ విద్యార్థులకు నగదు బహుమతులు అందించి ప్రోత్సహించేవారు. ఆర్యవైశ్య సంఘానికి అధ్యక్షులుగా ఉన్నప్పుడు వైశ్యసంఘం భవనానికి 5 లక్షల రూపాయలు డిపాజిట్ చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. వెంకట్రామయ్య భార్య హైమవతమ్మ అయిదేళ్ళ క్రితం పరమపదించారు. ఆయనకు ఒక కొడుకు ఒక కూతురు ఉన్నారు. కూతురు అమెరికాలో స్థిరపడగా, కొడుకు ప్రవీణ్‌కుమార్ ఇక్కడే ఉన్నారు. కారంశెట్టి వెంకట్రామయ్య మృతి పట్ల ఆర్యవైశ్య నాయకులు తమ సంతాపం ప్రకటించారు. ఆర్యవైశ్య ప్రముఖుడు, గాంధేయవాది కెవి చలమయ్య వెంకట్రామయ్య మృతికి విచారం ప్రకటిస్తూ ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# నిరాడంబరంగా.. వెంకటగిరి పోలేరమ్మ జాతర



జిల్లాలో ప్రతిఏటా ఎంతో వైభవంగా జరిగే వెంకటగిరి పోలేరమ్మ జాతర ఈసారి కరోనా ప్రభావంతో అత్యంత నిరాడంబరంగా జరిగింది. జాతరలో ప్రధానమైన బుధ, గురువారాల్లో (9,10 తేదీలు) భక్తుల సందడి లేకపోవడంతో జాతర కళ కనిపించలేదు. కోవిడ్ నిబంధనలతో అందరూ ఎవరిళ్ళల్లో వాళ్లు అమ్మవారికి నిండుభక్తితో ప్రత్యేకపూజలు చేసుకున్నారు. జాతరలో భాగంగా సంప్రదాయబద్ధంగా అమ్మవారి మట్టి విగ్రహాన్ని రూపొందించి అమ్మవారి మంటపంలో కొలువు దీర్చారు. ఈ వేడుకల్లో గతంలో వేలసంఖ్యలో భక్తులు పాల్గొనేవారు. ఇప్పుడు భక్తులకు అనుమతి లేకపోవడంతో భక్తులు ఈ వేడుకలకు రాకుండా పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు నిర్వహించి ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఆలయ నిర్వాహకులు అమ్మవారికి జాతర సందర్భంగా సంప్రదాయబద్ధంగా జరిగే కార్యక్రమాలన్నీ ఏకాంతంగా, నిరాడంబరంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ మండపాలను విద్యుత్‌దీపాలతో, పుష్పతోరణాలతో శోభాయమానం చేశారు. కోవిడ్ నిబంధనల మేరకు ప్రజలంతా ఇళ్ళలోనే అమ్మవారికి పూజలు చేసుకోవాలని, బంధుమిత్రులెవరినీ జాతరకు ఆహ్వానించవద్దని ఎమ్మెల్యే రామనారాయణరెడ్డి, అధికారులు, ఆలయ నిర్వాహకులు సూచించిన నేపథ్యంలో ఇతర ప్రాంతాలవారెవరూ ఈసారి జాతరకు రాలేకపోయారు. ఆలయ మండపం వద్ద గురువారం నాడు జరిగిన అమ్మవారి నిలుపు వేడుకలోనూ భక్తులు కనిపించలేదు. అమ్మవారి పూజలు, సేవలు అన్నీ ఏకాంతంగానే, ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగాయి.

# స్వామి ప్రజ్ఞారణ్య.. ఇక లేరు



రమణ మహర్షి బోధించిన 'నేనెవరు?'.. అనే అన్వేషణలోనే జీవితాంతం గడిపిన మహనీయుడు, బుచ్చిరెడ్డిపాళెం సమీపంలోని యోగి రామ తపోవనం స్థాపించి, యోగి ప్రోటోప్లాజమ్‌గా దేశవిదేశాల్లో ఎనలేని విఖ్యాతిని పొందిన స్వామి ప్రజ్ఞారణ్య (90) ఈనెల 9న కన్నుమూశారు. అత్యద్భుతమైన ఆధ్యాత్మిక ప్రవచనాలతో ఆయన జీవితాన్ని ధన్యం చేసుకున్నారు. ఆ దివ్యమూర్తి మరణంతో ఆయన అనుచరులు, భక్తులు శోకసాగరంలో మునిగిపోయారు. ఆయన ఆజన్మ బ్రహ్మచారి కూడా. తొలినుంచీ సైన్స్ అంటే ఎనలేని అభిమానం. నెల్లూరులోని విఆర్ కళాశాలలో అధ్యాపకునిగా ఉద్యోగం చేస్తున్నప్పుడు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు 1960 ప్రాంతాల్లో 'సృష్టి', 'ఊహాశక్తి' అనే సైన్స్ పత్రికలు కూడా నడిపిన విజ్ఞానఖని ఆయన. ఉద్యోగ విరమణ అనంతరం ఆయన సన్యాసాశ్రమం స్వీకరించారు. హిమాలయ ప్రాంతాల్లో కొన్నేళ్ళపాటు సాధన చేసిన తర్వాత తన ఆధ్యాత్మిక గురువు, రమణ మహర్షి అంతేవాసి అయిన యోగి రామయ్యగారి పేరుతో తన స్వస్థలమైన బుచ్చిరెడ్డిపాళెం సమీపంలోని అన్నారెడ్డిపాళెంలో 'యోగిరామ తపోవనం' నెలకొల్పారు. అక్కడ దేశ విదేశాల నుంచి వచ్చే సాధకుల కోసం ధ్యానశిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఇక్కడే కాకుండా దేశంలోని పలు ప్రసిద్ధమైన ఆశ్రమాల వారు కూడా స్వామి ప్రజ్ఞారణ్యను ఆహ్వానించేవారు. ఆధునిక విజ్ఞానాన్ని ఆధ్యాత్మికత్వంతో మేళవించి ఆయన చేసే ప్రవచనాలు భక్తులను బాగా ఆకట్టుకునేవి. ఈ విజ్ఞానబోధలకు ఉపకరించేవిధంగా ఒక మైక్రోస్కోప్‌ను కూడా రూపొందించి దాన్ని పేటెంట్ కూడా చేయించిన అరుదైన ఆధ్యాత్మిక శాస్త్రవేత్త స్వామీ ప్రజ్ఞారణ్య. ఆయన మృతికి విచారం వ్యక్తం చేస్తూ పూర్వవిద్యార్థులైన ఎంవిఎస్ ప్రసాద్ (ఆకాశవాణి చెన్నై విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్), ప్రముఖ ఫిజిషియన్ డాక్టర్ సివి సుబ్రహ్మణ్యం, విఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్స్ డా.ఎం.సుబ్రహ్మణ్యం, డా.సివిఎస్ భాస్కర్, ప్రఖ్యాత శాస్త్రవేత్త డా.ఏ.జగదీష్‌లతో పాటు ప్రముఖ సాహితీవేత్త డా.కాళిదాసు పురుషోత్తం తదితరులు ఘననివాళులర్పించారు. తన ఆధ్యాత్మిక, విజ్ఞానాత్మక బోధనలతో ఎంతోమందిని ప్రభావితం చేసిన మహోన్నత వ్యక్తి..స్వామి ప్రజ్ఞారణ్య లేకపోవడం నెల్లూరు సీమకే కాదు..ఆధ్యాత్మిక రంగానికే తీరని లోటు. ఆ మహనీయుని మృతికి చింతిస్తూ కన్నీటి నివాళులర్పిస్తోంది..'లాయర్'!..

## ఉపరాష్ట్రపతి సంతాపం

స్వామీ ప్రజ్ఞారణ్య గారు పరమపదించారని తెలిసి ఎంతో బాధపడ్డానని, నెల్లూరు విఆర్ కాలేజీలో చదివే రోజుల్లో వారు తమ గురువుగారని, వృక్ష శాస్త్రంలో ఆయనకు మంచి పేరుందని భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. తిరుమల గిరుల్లో ఆయన ఒక నాచు మొక్క జాతిని కనుగొన్నారని, దానికి 'స్పైరోజైరా ఏడుకొండల స్వామినెన్స్' అని పేరుపెట్టారని, జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో ఆయన తన పరిశోధనా పత్రాన్ని తెలుగు భాషలోనే సమర్పించిన మాతృభాషాభిమాని అని ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. అధ్యాపకుడిగా ఎంతోమంది జీవితాలను తీర్చిదిద్ది, ఆధ్యాత్మిక గురువుగా ఎంతో మందికి మార్గదర్శనం చేశారన్నారు. స్వామి ప్రజ్ఞారణ్యగారి జీవితం భావితరాలకు ఆదర్శప్రాయమని, వారి దివ్యస్మృతికి నివాళులర్పిస్తున్నానని వెంకయ్య పేర్కొన్నారు.

# విలక్షణ సినీనటుడు జేపీ హఠాన్మరణం

తెలుగు సినిమారంగంలో విలక్షణ నటునిగా విఖ్యాతి పొందిన జయప్రకాష్‌రెడ్డి (జేపీ) గుంటూరులోని తన నివాసంలో ఈనెల 8న గుండెపోటుతో మరణించారు. ఆయన వయసు 74 సంవత్సరాలు. ఆయన హఠాన్మరణంతో సినీరంగం, నాటకరంగం శోకతప్తమయ్యాయి. ఆయన మృతి ఎంతో బాధాకరమని, ఆయన లేని లోటు తీరనిదని సినీప్రముఖులు, రంగస్థల ప్రముఖులు తమ ఆవేదన వెలిబుచ్చారు.



బ్రహ్మపుత్రుడు, బొబ్బిలిరాజా చిత్రాల్లో తొలుత చిన్న చిన్న పాత్రల్లో నటించినా ఆ తర్వాత అందివచ్చిన అవకాశాలతో ఆయన ప్రేమించుకుందాం రా, సమరసింహారెడ్డి, నరసింహనాయుడు, పల్నాటి బ్రహ్మనాయుడు, విక్రమార్కుడు, జంబలకిడి పంబ, కబడ్డీ కబడ్డీ వంటి చిత్రాల్లో అత్యద్భుతంగా నటించి మంచి విలన్‌గా, కమెడియన్‌గా కూడా మంచిపేరు తెచ్చుకున్నారు. ప్రత్యేకించి రాయలసీమ యాసతో ఆయన డైలాగ్‌లు అందరినీ ఎంతో బాగా ఆకట్టుకున్నాయి. నాటకాలంటే ఆయనకు మహా ఇష్టం. ఆయన 'అలెగ్జాండర్' (నాటకం) ఏకపాత్రాభినయం ఎన్నో సార్లు ప్రదర్శించి ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నారు.

## నెల్లూరుతోనూ ఎంతో అనుబంధం :

జయప్రకాష్‌రెడ్డికి నెల్లూరుతో మంచి అనుబంధం ఉంది. ఆయన స్వస్థలం కర్నూలుజిల్లా అయినప్పటికీ, తండ్రి ప్రభుత్వోద్యోగి కావడంతో ఆయనతో పాటు ఇక్కడికి వచ్చి నెల్లూరులో కొంతకాలం పాటు ఉన్నారు. జేపీ చిన్ననాటి చదువంతా నెల్లూరులోనే. నగరంలోని ఫత్తేఖాన్‌పేటలో ఉన్న రామయ్య బడిలో జేపీ ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదువుకున్నారు. ఆ తర్వాత రంగనాయకులపేటలోని సెయింట్‌పీటర్స్ ఉన్నతపాఠశాలలో 6,7 తరగతులు చదువుకున్నారు. నెల్లూరు టౌన్‌హాలులో ప్రదర్శించిన 'అతడే సైన్యం' నాటికలో జేపీ ప్రధాన పాత్రను అత్యద్భుతంగా పోషించి ఉత్తమ నటుడిగా గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చేతుల మీదుగా బహుమతిని కూడా అందుకున్నారు. 2012లో నెల్లూరులోని శ్రీవేంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో ఆయన ప్రదర్శించిన 'అలెగ్జాండర్' నాటకం మరో అద్భుతం.

అత్యుత్తమ నటనతో అందరి అభిమానం పొందిన జేపీకి 'లాయర్' నివాళి!...

# కుదుటపడుతున్న మధుర గాయకుడి ఆరోగ్యం



50 వసంతాలుగా తన గాత్రంతో సుమధుర గానాలతో భారతీయ సినిమా సంగీత ప్రియలను అలరిస్తున్న శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం ఆరోగ్యం నెమ్మదిగా కుదుటపడుతోంది. కరోనా వ్యాధితో ఆగస్టు 5వ తారీఖు నుండి మద్రాసులోని ఎంజిఎం ఆసుపత్రిలో అయన చికిత్సపొందుతున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఆయనకు కరోనా నెగటివ్ వచ్చింది. అయితే ఊపిరితిత్తులలో చేరిన ఇన్ఫెక్షన్ శాతం ఎక్కువగా వుండి నెమ్మదిగా కోలుకుండడంతో మరి కొన్ని రోజులు ఆయన ఆసుపత్రిలోనే ఉండాల్సి వస్తుందని అంటున్నారు.

ఆయన ఇప్పుడు స్పృహలోనే వుంటూ ఆయనకు ఇష్టమైన ఐపియల్ క్రికెట్‌తో పాటు టెన్నిస్ కూడా చూసి ఆనందిస్తున్నాడని అయన కుమారుడు ఎస్‌పి చరణ్ సామాజిక మాధ్యమాల ద్వారా తెలిపాడు. సెప్టెంబర్ 5వ తేదీన ఆయన వివాహ దినోత్సవం సందర్భంగా ఆయన శ్రీమతితో కలిసి కేక్ కూడా కట్ చేశారు. ఆయన పరిపూర్ణంగా కోలుకుని మరికొన్ని దశాబ్దాల పాటు సంగీత సామ్రాజ్యంలో వెలుగులు విరజిమ్మాలని ప్రపంచవ్యాప్తంగా వున్న ఆయన అభిమానులు ప్రార్థిస్తున్నారు.

## మాగుంట లే అవుట్లో...

# కిడ్నాప్ కథ కంచికి.. అసలు దోషులు ఇంటికి



## • ధనస్వామ్యమా వర్థిల్లు

గత గురువారం (3వ తేదీ) నెల్లూరు మాగుంట లే అవుట్‌లో జరిగిన కిడ్నాప్ కథ అనేక మలుపులు తిరిగి చివరికి సినిమా ఫక్కీలో అసలు దోషులు ఇంటికి వెళ్లి కిరాయి మూకలు జైలుకు వెళ్లడంతో సుఖాంతమయ్యింది. తెలిసిన సమాచారం మేరకు వివరాల్లోకి వెళ్తే....

మాగుంట లే అవుట్‌లో నివాసముంటున్న నరేష్ కుమారుడు అక్షిత్ తన ఇంటి బయట సైకిల్ తొక్కుకుంటూ ఆడుకుంటుండగా, ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి అక్షితను కిడ్నాప్ చేసే ప్రయత్నం చేశారు. అయితే అక్షిత్ కేకలు వేయడంతో అక్కడ వున్న స్థానికులు అదే సమయానికి అటువైపుగా వస్తున్న 4వ పట్టణ సిఐ వాహన డ్రైవర్ శేఖర్, కమాండ్ కంట్రోల్ రూమ్ కానిస్టేబుల్ శ్రీకాంత్‌లు కలిసి నిందితులలో ఒకడిని పట్టుకున్నారు. అక్షిత్ తండ్రి నరేష్, తాత నరసింహులు వెంటనే పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి తమకీ, నగరంలోని ఒక స్కూల్ యాజమాన్యానికి మధ్య వివాదాలు ఉన్నాయని, ఈ కిడ్నాప్‌కీ వారికీ సంబంధం ఉందని ఫిర్యాదు చేయడమే కాకుండా మీడియా ముందు సైతం ఇదే విషయాన్ని చెప్పారు. అయితే రెండు రోజుల్లో కథ మారినట్లు తెలుస్తోంది. రాజధాని స్థాయిలో, ఆటు పోలీసులపైన ఇటు బాధితులపైనా వత్తిడి పెరిగి, భాగస్తుల మధ్య వివాదం అటకెక్కిందని, ఎఫ్ఐఆర్ మారిందని, కేసు కిరాయి మూకలపైకి వెళ్ళిందని గగ్గోలుగా ఉంది. ఓ నలుగురు ఆకతాయిలు వ్యసనాలకు అలవాటు పడి కరోనా సమయంలో డబ్బుల కోసం ఈ కిడ్నాప్‌కు పాల్పడ్డారని చెప్పేసి ఆ నలుగురిని మీడియా ముందు పెట్టి, వారిని జైలుకు పంపారని సర్వత్రా వినిపిస్తోంది.

ఒకవేళ ఆ రోజు నిందితులు పట్టుబడకుండా ఉండివుంటే...? కిడ్నాప్ జరిగి ఉంటే..?? అక్షిత్‌కి ఏదైనా అయ్యుంటే...? ఈ ప్రశ్నలకి ఇప్పుడు సమాధానాలు దొరకవు. కథ కంచికి వెళ్ళినట్టే! కిడ్నాప్‌కి కిరాయి కుదుర్చుకున్న చిల్లరగాళ్ళు మాత్రం జైలుకు వెళ్లి, అసలు పథకం రచించిన పెద్దమనుషులు మాత్రం ఇంటికి వెళ్లారని స్థానికుల్లో చర్చనీయాంశంగా ఉంది. ధనస్వామ్యమా వర్థిల్లు!...

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలని జిల్లా పంచాయతి అధికారి ధనలక్ష్మి చెప్పారు. ఈనెల 9న నాయుడుపేటలో ఎండిఓ కార్యాలయంలో ఆమె సమావేశం నిర్వహించి అధికారులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. గ్రామాల్లో ఎక్కడా పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, కరోనా పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హోం క్వారంటైన్‌లలో ఉన్న కోవిడ్ బాధితులకు మందుల కిట్‌లు అందించాలని సిబ్బందికి సూచించారు.



## భావి తరాల భవిత

# మూడు రాజధానులు

## పుస్తకాన్ని ఆవిష్కరించిన రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత డాక్టర్ గాజులపల్లి రామచంద్రారెడ్డి రచించిన "భావితరాల భవిత మూడు రాజధానులు" పుస్తకాన్ని గురువారం సాయంత్రం తాడేపల్లిలోని ఆయన నివాసంలో వైఎస్ఆర్‌సిపి రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఆవిష్కరించారు. పాలనా వికేంద్రీకరణ లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన ఆలోచనలను ప్రతిబింబించే విధంగా రచయిత ఈ పుస్తకాన్ని రూపొందించారు. ముఖ్యమంత్రి ఆశయాలను నిజం చేయడానికి, వాస్తవాలను ప్రజల ముంగిళ్ళలో ఆవిష్కరించడానికి ఇలాంటి గ్రంథాలు బాగా ఉపయోపడతాయని, రామచంద్రారెడ్డి గారు రాసిన ఈ పుస్తకం ప్రజలను చైతన్య పరచి ఆలోచింపచేసే విధంగా ఉందని ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్నారు.

కార్యక్రమంలో నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, పుస్తక ప్రాయోజికకర్త సికో బయోటిక్స్ అధినేత శీలం జయరాంరెడ్డి, 'లాయర్' వారపత్రిక సంపాదకుడు, రూపా పబ్లికేషన్స్ అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి(ప్రభు), వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అరపూట లాక్‌డౌన్ ఎత్తేయండి




కరోనాను కట్టడి చేసే ప్రయత్నంలో జిల్లా యంత్రాంగం అరపూట లాక్‌డౌన్ అనే అనాలోచిత నిర్ణయం చేసిందేమోనని పిస్తోంది. యావత్ భారతదేశంలో కరోనా కట్టుబాట్లన్నీ సడలించేశారు. ఒక్క ఆంధ్ర ప్రదేశ్‌లో మాత్రం అధికార యంత్రాంగం అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తోందన్న అనుమానం ఇప్పుడు అందరిలోనూ కలుగుతోంది. ముంబై, చెన్నై, హైదరాబాద్, బెంగుళూరు వంటి మహానగరాలలో సైతం నిబంధనలను పూర్తిగా సడలించారు. మన రాష్ట్రంలో కూడా విశాఖపట్నం, విజయవాడ వంటి నగరాల్లో ఎలాంటి కట్టుబాట్లు లేవు. సామాజిక దూరం పాటించండి, శానిటైజర్లు వాడండి, ముఖానికి మాస్కులు వేసుకోండి లేదంటే మీ చావు మీరు చావండి అంటూ జనాన్ని వదిలేశారు. తీసుకోవలసిన జాగ్రత్తల గురించి మాత్రం తరచూ అవగాహన కలిగిస్తూ హెచ్చరికలు చేస్తున్నారు. ఇదే మంచి పద్ధతి. కరోనా పట్ల ప్రజల్లో అవగాహన రావాలి, వారి ఆరోగ్యంపట్ల వారికి భాధ్యత పెరగాలి, ఎక్కడ వ్యాధి అంటుకుంటుందో అన్న భయంతో పాటు వ్యాధి వచ్చినా ఎదుర్కోగలమనే ధైర్యం వారిలో రావాలి.

ఇలా ఒక్కపూట లాక్‌డౌన్ పెట్టినందు వల్ల ప్రజలందరూ ఒక్కసారిగా బయటకు వచ్చేస్తున్నారు, మధ్యాహ్నం నుండి షాపులు వుండవు కాబట్టి మధ్యాహ్నం లోపే తమకు కావలసిన సరుకులు కొనుక్కోవడానికి క్యూలు కడుతున్నారు. సూపర్ మార్కెట్లలో, కూరగాయల మార్కెట్లలో, చేపల మార్కెట్లలో మొదటిరోజు సినిమా టిక్కెట్లకోసం పోటీ పడినట్లుగా సరుకులు కొనుక్కోవడానికి పోటీ పడుతున్నారు.

దాదాపు 5 లక్షలకుపైగా వున్న నగర జనాభాని ఒక్క పూటలో అన్నీ కొనుక్కోండి అని రోడ్లమీదకు వదలడంతో ఒక్కసారిగా కేసుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిపోతోందన్న వాదన కూడా బలంగా వినపడుతోంది.

ఉదాహరణకు ఒక్క పూటలో వెయ్యి మంది షాపింగ్ చెయ్యడానికి ఒక్క రోజులో వెయ్యిమంది షాపింగ్ చెయ్యడానికి తేడా స్పష్టంగా తెలుస్తుంది.

ప్రతి మనిషిదీ అవసరమే. అందుకే అందరు ఎగబడుతున్నారు, చాలా చోట్ల చాలామంది మాస్కులు పెట్టడం లేదు, ఒక్క పూటే అంగళ్ళు తెరుచుకుంటుండంతో భౌతిక దూరం పాటించే పరిస్థితే లేదు. మధ్యాహ్నం తరువాత లాక్‌డౌన్ సక్రమంగా అమలవుతుందా లేదా అన్న దానిపై చూపిస్తున్న శ్రద్ధలో ఒక్క శాతం కూడా సడలింపులో నిబంధనలు పాటిస్తున్నారా లేదా అన్న విషయంలో చూపించడంలేదు.

మొన్న ఆదివారం పెట్టినట్లుగా ఒక్క రోజు పూర్తి లాక్‌డౌన్ అన్న నిర్ణయం మంచిదేకాని ఇలా అరపూటలోనే అన్నీ కానిచ్చెయండి అని చెప్పడం అర్ధరహితం.

సడలింపు అరపూటే కావడంతో అంగళ్ళన్నీ జనం రద్దీతో కిటకిటలాడిపోతున్నాయి. రోడ్లన్నీ జనసంద్రంగా మారిపోతున్నాయి. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో వాహనాల రద్దీకూడా బాగా పెరిగి ట్రాఫిక్‌జామ్‌లు కూడా జరుగుతున్నాయి. ఇవన్నీ కరోనా విజృంభణకు కారణం కావా? అధికారులే చెప్పాలి మరి!...

అధినేతలూ, అధికారులూ ఆలోచించండి. ఒక్క రోజులో చేయాల్సిన పనిని ఒక్క పూటలో చెయ్యమంటే ఆ పనిలో నాణ్యత ఎంత ఉంటుందో ఊహించుకోండి. ఒక షాపులో ఒక్క రోజులో షాపింగ్ చేసే అదే వందమందిని ఒక్క పూటలో చెయ్యమంటే సామాజిక దూరం ఎలా సాధ్యమో మీరే ఒక్కసారి ఆలోచించండి.

మిగతా ప్రాంతాల్లోలాగ లాక్‌డౌన్ పూర్తిగా ఎత్తేయండి, మాస్కులు, శానిటైజర్లు, సామాజిక దూరం పట్ల అవగాహన పెంచండి. ప్రజలు వారి ఆరోగ్యం పట్ల వారే జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించండి, నిర్లక్ష్యం చేస్తే జరిగే అనర్ధాలను వివరించండి. అప్పుడైనా కరోనాకు కళ్లెం పడుతుందని ఆశిద్దాం!

**కొసమెరుపు :** 'సంచారి' ఈ వార్త రాసే సమయానికి లాక్‌డౌన్‌ను 4గంటల పాటు సడలించారు. సెప్టెంబర్, 15వ తేదీ వరకు నెల్లూరు నగరంలో ఉదయం 6గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు మాత్రమే దుకాణాలు పని చేస్తాయని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్ బాబు ప్రకటించడం గుడ్డిల్లో మెల్లగా భావించవచ్చు.

**– సంచారి**

## 'ప్రభా'తం

'ఆరోగ్యమే మహాభాగ్యం' అని మన పెద్దలు ఎందుకన్నారో అందరికీ తెలిసొస్తున్న దశ ఇది. అన్ని భాగ్యాలకంటే ఆరోగ్యమే మహాభాగ్యం అని ఇప్పుడు రుజువవుతోంది కూడా. కరోనా నేపథ్యంలో ఇప్పుడు ఎక్కడ చూసినా ఆరోగ్యంపైనే చర్చ జరుగుతోంది. సమతులాహారం, పౌష్టికాహారం, బలవర్థక ఆహారం, వ్యాధినిరోధక శక్తి వంటి మాటలు ఇప్పుడు అన్నిచోట్లా వినపడుతున్నాయి. పౌష్టికాహారం సక్రమంగా లేకపోతే వ్యాధినిరోధక శక్తి తగ్గిపోయి లేనిపోని వ్యాధులకు గురికావాల్సి వస్తుందనే నాటి పెద్దల మాట ఇప్పుడు వజ్రాల మూటగా మారింది. దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు గత కొన్ని నెలలుగా మంచి పౌష్టికాహారం కొరకు అన్వేషించి మరీ కొనుగోలు చేసుకుంటున్నారు. సంప్రదాయబద్ధమైన, పోషక విలువలున్న ఆహార పదార్థాలను వినియోగించుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇదెంతో శుభపరిణామం. కరోనా నేర్పిన ఈ గుణపాఠం మనల్ని మంచి ఆహారపు అలవాట్లలోకి తీసుకువెళ్తుందనే అనుకోవచ్చు.

పౌష్టికాహార లోపం వల్ల కలిగే అనర్థాలు అన్నిన్ని కావు. రోగ నిరోధకశక్తిని పెంపొందించేది పౌష్టికాహారమే. పోషకాహారం సరిగా లేకుంటే రక్తహీనత, బుద్ధిమాంద్యం, ఊబకాయం వంటి సమస్యలకు దారితీస్తుంటాయని, ఆ లోపం అలాగే కొనసాగితే రక్తపోటు, మధుమేహం, మూత్రపిండాల వ్యాధుల వంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు కూడా దాపురిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అన్నిరకాల అనారోగ్యాలకు పౌష్టికాహారమే దివ్యౌషధ మని అంటున్నారు. ప్రజలు కూడా ఈ పరిస్థితులన్నిటినీ గమనించి సంప్రదాయబద్ధమైన పోషక విలువలున్న ఆహారాన్ని, మంచి ఆహారపు అలవాట్లను ఆచరణలో పెట్టాల్సి ఉంది. ఇతరత్రా జంక్‌ఫుడ్ వంటి వాటిపై మోజు పెంచుకోవడం వల్ల ఉపయోగం లేకపోగా అవి అనేక రకాల అనారోగ్య సమస్యలకు దారితీస్తాయని గ్రహించాలి. అయితే, అనారోగ్యానికి కారణాలు అనేకం. సమాజంలో చుట్టుముట్టి ఉన్న అపారిశుద్ధ్యం, కల్తీ ఆహారపదార్థాలు, పోషకాహారం సక్రమంగా లభించక పోవడం వల్ల ఏటా దేశంలో ఎంతోమంది అనారోగ్యాల పాలై మృత్యువాత పడుతున్నారు కూడా. అందుకే ప్రతిఒక్కరూ తమ శక్తిమేరా సూక్ష్మ పోషక పదార్థాలకు, బలవర్ధకమైన సమతులాహారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారమే ముఖ్యమని స్పష్టం చేస్తున్నారు.

అయితే ప్రపంచం మొత్తమ్మీద పౌష్టికాహార లోపంతో బక్కచిక్కిపోతున్న బాలల్లో 25 శాతం మందికి పైగానే భారత్‌లో ఉన్నారని గణాంకాలు చెప్తున్నా బాలలకు పౌష్టికాహారం అందించడంలో దేశం ఇంకా వెనుకబడే ఉండడం బాధాకరం. అంతేకాదు ప్రపంచంలోని నానా రకాల వ్యాధుల్లో 20 శాతం వ్యాధులు భారత్‌నే అంటిపెట్టుకుని ఉన్నాయని కూడా నిపుణులు అంచనాలు వెల్లడిస్తున్నాయి. పౌష్టికాహారం లభించక పేదలెందరో అనారోగ్యాల పాలవుతూనే ఉన్నారు. కరోనా వ్యాధి బారినపడుతున్న వారిలో అత్యధికశాతం మంది పేదవర్గాల వారేనని కూడా అందరికీ తెలిసిందే. ఒకవైపు ఉపాధి కోల్పోయి, మరోవైపు ఆర్థికస్థితిగతులు పూర్తిగా ఛిన్నాభిన్నమై కుటుంబాలను పోషించుకోలేక ఆకలితో అల్లాడుతున్న పేదప్రజలెందరో ఇప్పుడు కరోనా దెబ్బకు మరింతగా విలవిల్లాడిపోతున్నారు. ఈ ఘోరవిపత్తు నుంచి ఎప్పుడు బయటపడతామోనని ఆశగా ఎదురుచూస్తూనే ఉన్నారు. వారిని వెంటనే ఆదుకునేందుకు ప్రభుత్వాలు మరింత పెద్దమనసుతో ముందుక రావాలి.

సాధారణంగా అనారోగ్యాలన్నవి కొత్తవేమీ కాదు. సమాజంలో ఎంతో కాలం నుంచి ఎన్నో రకాలుగా వస్తూ ఉన్నవే. ఈ మధ్యలో సీజనల్ వ్యాధులం మేమున్నామంటూ మరోవైపు మలేరియా, మెదడువాపు, డెంగ్యూ, డయేరియా, చికున్‌గున్యా, కామెర్లు, విరోచనాలు, విషజ్వరాలు వగైరాలు ప్రతిఏటా జనాన్ని చుట్టుముడుతూనే ఉన్నాయి. అసలే కరోనా దెబ్బతో చతికిలబడిపోతుంటే మధ్యలో ఈ సీజనల్ వ్యాధులొకటి. అన్నీ ఒక్కసారిగా వచ్చిపడేసరికి పేదలు, వ్యాధిగ్రస్తుల బాధల గాధలకు అంతే లేకుండా పోతోంది. అత్యవసరమయ్యే డయాలసిస్‌లు, ప్రసవ వేదనలు, రక్తమార్పిడుల, గుండెజబ్బుల వంటి వాటికి చికిత్స చేయించుకోవాలంటే ఈ కరోనా కష్టకాలంలో తగు వనరులు, వెసులుబాట్లు లేక ఆసుపత్రుల సౌకర్యాలు లేక ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. అనేక ఆసుపత్రుల్లో పరిస్థితి భీభత్సంగా ఉంది. ఎక్కడ చూసినా కరోనా కల్లోలమే. ఈ అసాధారణ పరిస్థితుల్లో సాధారణ జబ్బులు వచ్చినా ఆసుపత్రులకు వెళ్ళాలంటే కరోనా భీతితో పేదప్రజలు సాహసం చేయలేకపోతున్నారు. ఎక్కడ చూసినా కరోనా రోగులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్న నేపథ్యంలో ఇప్పుడు సాధారణ జబ్బుల నివారణకు ఆసుపత్రుల వారు తీసుకుం టున్న శ్రద్ధ నామమాత్రంగానే ఉంది. అందుకే కరోనాతో పాటు, ఇతర జబ్బులను కూడా నియంత్రించేందుకు ప్రత్యేకంగా ఆరోగ్యవ్యవస్థల్ని ముందుగానే పటిష్టం చేసుకోవాలని ఎంతో ముందుజాగ్రత్తతో ప్రధాని మోడీ ముందుగానే హెచ్చరించినా రాష్ట్రాల్లో ఆ మేరకు జాగ్రత్తలు తీసుకున్న దాఖలాలు పెద్దగా కనిపించడం లేదు. పర్యవసానంగా ప్రజలకు ముఖ్యంగా పేదలకు ఎన్నో అవస్తలు నిత్యం ఎదురవుతూనే ఉండడం మనం చూస్తూనే ఉన్నాం.

ఏదేమైనా ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యానికి, సంక్షేమానికి, ముఖ్యంగా పేదలందరికీ పౌష్టికాహారం అందించడానికి ప్రాధాన్యతనిచ్చి వాటికి నిధుల కొరత లేకుండా చూడాలి. ప్రస్తుత పరిస్థితుల్లో అనారోగ్యాల నుంచి బయటపడేందుకు పౌష్టికాహారమే శ్రీరామరక్ష!.. అందువల్ల దేశంలో పౌష్టికాహార ఉత్పత్తులను మరింతగా పెంచాలి. ప్రజలందరికీ పౌష్టికాహారాన్ని అందుబాటులోకి తీసుకురావాలి. అందుకు మేధావులు, ప్రజలు అందరూ తమవంతు సహకరించాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో మరింత సమన్వయంతో అడుగు ముందుకు వేసి అట్టడుగుస్థాయి దాకా ప్రజారోగ్యాన్ని పరిపుష్టం చేసేందుకు నిర్దిష్టమైన, ప్రణాళికాబద్ధమైన చర్యలను శాశ్వత ప్రాతిపదికపై తీసుకోవాల్సిన సమయం ఇదే!...

### పౌష్టికాహారమే శ్రీరామరక్ష!



పౌష్టికాహార లోపం వల్ల కలిగే అనర్థాలు అన్నిన్ని కావు. రోగ నిరోధకశక్తిని పెంపొందించేది పౌష్టికాహారమే. ఇది సరిగా లేకుంటే లేనిపోని అనారోగ్యాలకు తలుపులు తెరచినట్లే. అనారోగ్యాన్ని పారద్రోలేందుకు పౌష్టికాహారమే దివ్యౌషధమని.. అదే మన ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని నిపుణులు సూచిస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి, అందరికీ పౌష్టికాహారం అందించడానికి ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలి. వాటికి నిధుల కొరత లేకుండా చూడాలి. ప్రజారోగ్యాన్ని పరిపుష్టం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలి.

---

### జాతీయ మీడియాకి
## 'టిఆర్‌పి'ల పిచ్చి పట్టిందా?




కోవిడ్ వ్యాధితో యావత్ ప్రపంచం భయభ్రాంతులకు గురై వణికిపోతుంటే, ఒక సినీ నటుడి ఆత్మహత్యపై జాతీయ మీడియా చేస్తున్న రాద్ధాంతం చూస్తుంటే వీరికి టిఆర్‌పి(టెలివిజన్ రేటింగ్ పాయింట్) పిచ్చి పట్టిందా అన్న అనుమానం కలుగుతుంది. జూన్ 14న సుశాంత్‌సింగ్ రాజ్‌పుట్ ఆత్మహత్య చేసుకున్నప్పడినుండి ఏ జాతీయ మీడియా ఛానల్ ని గమనించినా రోజులో ఎక్కువ సమయం ఆ యువ హీరో ఆత్మహత్య కథనాలనే చూపిస్తున్నారు, హత్య అని ఒకరు, కాదు ఆత్మహత్య అని మరొకరు, ప్రియురాలే కారణమని ఒకసారి, కాదు డ్రగ్సే కారణమని మళ్ళీసారి, ఇలా ఎవరికి తోచిన రీతిలో వారు ఉహాగానాలతో కూడిన వార్తలు ప్రసారం చేస్తూ ప్రేక్షకులకు పిచ్చెక్కిస్తున్నారు. దాదాపు 3నెలలుగా ఏ ఛానల్ పెట్టినా జాతీయ మీడియా మొత్తం సుశాంత్ చుట్టూ ప్రదక్షిణ చేస్తోంది. ప్రజాస్వామ్యంలో మూలస్తంభాల్లో ఒకటిగా వుండి, ప్రజల ప్రయోజనాల కోసం బాధ్యతాయుత పాత్ర పోషించాల్సిన మీడియా ఇలా 90 రోజులుగా ఒక సినిమా హీరో ఆత్మహత్య చుట్టూ తిరుగుతూ టిఆర్‌పిల కోసం ప్రాకులాడటం సిగ్గుచేటైన విషయం. ఇప్పుడు కొత్తగా నటి కంగనా రనౌత్ ఈ సంఘటనకి రాజకీయ రంగు పులిమి మీడియాకి ఇంకా మేత అందిస్తోంది. మీడియా పుణ్యమా అని సుశాంత్ కథ అనేక మలుపులు తిరుగుతూ ఓ సినిమా కథలా తయారవుతోంది. సుశాంత్‌ది ఆత్మహత్య అయినా హత్యే అయినా ప్రజలకు పెద్దగా ఒరిగేదేమీ లేదు. మీడియా సోదరులు ఇంకైనా ఆ విషయం పక్కన పెట్టి సమాజానికి ఉపయోగపడే వార్తలకు ప్రాధాన్యతనిస్తే బాగుంటుంది.

**జి.వి.సుబ్బయ్య, పిడుగురాళ్ళ.**

## స్కాముల పుట్టగా.. స్కానింగ్ సెంటర్లు

కరోనా వ్యాధిని అడ్డం పెట్టుకుని ప్రైవేట్ ఆసుపత్రులు అడ్డంగా దోచుకుంటుంటే, సందట్లో సడేమియాగా స్కానింగ్ సెంటర్లుకూడా తమదైన తరహాలో దోపిడీకి తెరలేపాయి. పొగతోటలోని పలు స్కానింగ్ సెంటర్లతోపాటు గాంధీనగర్లో ఉన్న మరికొన్ని స్కానింగ్ కేంద్రాలు కూడా అనుమతులు లేకుండా కోవిడ్ టెస్టులు చేస్తూ దుర్మార్గపు దోపిడీకి పూనుకుంటున్నాయి. టెస్టుకు వచ్చిన వారి వివరాలు కూడా సరిగ్గా నమోదు చేసుకోకుండా, స్కానింగులో వారికి పాజిటివ్ వస్తే ఆ వివరాలు కూడా ప్రభుత్వానికి తెలుపకుండా ధనార్జనే ప్రధానంగా నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నాయి. కొన్ని స్కానింగ్ సెంటర్లయితే పొగతోటలోని ఆసుపత్రులతో కుమ్మక్కై నెగటివ్ వచ్చిన వాళ్లకి సైతం పాజిటివ్ అని చెప్పి భయభ్రాంతులకు గురిచేసి ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. జూన్12,2020న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన జి.ఓ నెం.296ని ఈ స్కానింగ్ సెంటర్లు ఉల్లంఘిస్తుంటే ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం బాధాకరం. పొగతోటలోని ఒక ఆసుపత్రి రోగులకు బిల్లుల్లో ఇంద్రధనుస్సును చూపిస్తుంటే, పేరులోనే గొప్ప ధనాన్ని చూపించే మరో ఆసుపత్రి రోగులని బిచ్చగాళ్ళని చేసి బయటకు పంపిస్తోంది. ఈ విషయాలన్నీ జిల్లా కలెక్టర్ తో పాటు ఇతర ఉన్నత అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్తున్నాము. శవాలపై బొరుగులు ఏరుకుంటున్న ఇలాంటి నీచపు చర్యలను అడ్డుకోవడానికే మా సంస్థ HELPS (Health, Education and Legal Protection Services) ప్రారంభమయ్యింది. ఎవరైనా పేషెంటు లక్షలు చెల్లించి బిల్లులు పొందలేకపోతే, ఏ మాత్రం లాయరు ఫీజులు లేకుండా కేవలం పోస్ట్ ఖర్చులతోనే నోటీసులిచ్చి న్యాయసేవ అందించేందుకు మా సంస్థ తరపున నేను సిద్ధంగా వున్నాను. న్యాయం కోరుకునేవారు దిగువ నంబర్లలో నన్ను సంప్రదించవచ్చు. 94919 81544, 94401 61295.

**జి.వి.నాగరాజారావు,**
**హైకోర్టు న్యాయవాది, నెల్లూరు.**

## మధ్యవర్తుల జేబులు నింపుతున్న మద్యం

ఆంధ్రప్రదేశ్‌లో మద్యనిషేదంవైపు అడుగులు వేసే క్రమంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల మద్యం తాగేవారి శాతం తగ్గిందో లేదో కానీ, మద్యం వల్ల జేబులునింపుకునే మధ్యవర్తుల సంఖ్య మాత్రం భారీగా పెరిగింది. "నిషేదానికి ముందే నిషా" అని గత వారం మీరు చెప్పినట్లుగా ఒకవైపు పక్క రాష్ట్రాల నుండి మన రాష్ట్రానికి మద్యం వరదలా వస్తుంటే, మరోవైపు మన రాష్ట్రంలో దొరికే ఖరీదైన మందు, అంటే తెలిసిన బ్రాండ్లు కావాలంటే మధ్యవర్తులను(దళారీలు) సంప్రదించాల్సిందే. రాజకీయ నాయకుల అండతో జరుగుతున్న ఈ దళారి వ్యవస్థను అదుపుచేసే దమ్ము ధైర్యం అటు పోలీసులకు కానీ ఇటు సెబ్ అధికారులకు కానీ లేదు. మద్యంప్రియులకు ప్రియమైన ఖరీదైన బ్రాండ్ల రేట్లను భారీస్థాయిలో ప్రభుత్వం పెంచినా అవి చేజిక్కించుకోవాలంటే మాత్రం పలుకుబడి ఉండాల్సిందే. పలుకుబడి ఒక్కటే కూడా సరిపోదండోయ్, ఇప్పటికే ప్రభుత్వం ధరలను భరించలేనంత స్థాయిలో పెంచేస్తే ఈ దళారి వ్యవస్థ ఆ ఖరీదైన మందుకు డిమాండ్ క్రియేట్ చేసి ఆ బ్రాండ్లను మరింత ఖరీదు చేసేసింది. ఏ విధంగా చూసినా మద్యం విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల మద్యం వాడకం తగ్గిందో లేదో కానీ మద్యం మాఫియా మాత్రం అన్ని దశల్లో అవతరించింది. ఇప్పుడే పణామాలు ఇలా వుంటే మరి సంపూర్ణ మద్య నిషేధం పెడితే పరిస్థితి ఏమిటో మనం ఊహించుకోవచ్చు.

**కొలకనూరు చక్రవర్తి, హైదరాబాదు.**

లాయర్
పాఠకులకు మనవి
మా(మీ) లాయర్ పత్రికకు
**సమాచారం / లేఖలు**
పంపదలచిన వారు
9866314741 నంబరుకు
వాట్సయాప్ ద్వారా గాని, లేదా
roopagroup@yahoo.comకి
ఈ-మెయిల్ ద్వారా గాని
పంపవలసిందిగా విజ్ఞప్తి.
పోస్టల్ చిరునామా :
ఫ్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు,
మాగుంట లే అవుట్, నెల్లూరు - 3.
- సం/-



# 'శివగామిని' గ్రంథాన్ని ఆవిష్కరించిన విపిఆర్

నెల్లూరుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, పద్యకళా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు, విశ్రాంత ఆంధ్రోపన్యాసకుడు మెట్టు రామచంద్రప్రసాద్ రచించిన 'శివగామిని' కావ్యాన్ని ఇటీవల నెల్లూరులో ఆవిష్కరించారు. దైవభక్తి పరాయణుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాసంలో ఈ కావ్యాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెట్టు రామచంద్రప్రసాద్ పద్యకవితా ప్రతిభను విపిఆర్ కొనియాడారు. కవి పండితుల ప్రశంసలందుకున్న ఈ 'శివగామిని' కావ్యాన్ని వ్యాఖ్యానంతో సహా ముద్రించడం విశేషం. ఈ కావ్యం కావాల్సిన వారికి ఉచితంగా ప్రింటెడ్ బుక్‌పోస్టు ద్వారా అందిస్తామని, తన ఫోన్ నెం.9346323609 నందు సంప్రదించాలని మెట్టు రామచంద్రప్రసాద్ తెలియజేశాడు.

### వానొస్తుందని గుబులు..

# ధర లేదని దిగులు

## అల్లాడిపోతున్న వేరుశనగ రైతులు



***అదేమి దురదృష్టమో తెలియదు కానీ ఈసారి వేరుశనగ పంట పండించుకున్న రైతులకు కూడా కష్టాలు ప్రారంభమయ్యాయి. పంట బాగా పండిందనే సంతోషం కంటే ఆ పంటను మంచి ధరకు అమ్ముకోలేక రైతులు నానా బాధలు పడుతున్నారు. ఒకవైపు వర్షం గుబులు.. మరోవైపు గిట్టుబాటు ధర లేదనే దిగులుతో వేరుశనగ రైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.***

జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఈసారి వేరుశనగ పంట బాగా పండింది. ఎంతో కష్టపడి రైతులు పంటను పండించారు. కానీ పంటను నిల్వచేసుకునే పరిస్థితి లేక అనేకమంది రైతులు రోడ్ల పక్కనే పట్టలు కప్పి వేరుశనగ రాశులను భద్రపరుచుకుంటున్నారు. అయితే ఏపూటకాపూట నల్లమబ్బులు వారిని భయపెడుతున్నాయి. ఎక్కడ వర్షం వచ్చి పంటంతా తడిసిపోతుందోనని రైతులు లోలోపలే కుమిలిపోతున్నారు. మరోవైపు దళారులు అత్యంత తక్కువ ధరకే వేరుశనగ పంటను కొనేందుకు వస్తుండడంతో, దళారులకు తక్కువ ధరకు పంటను తెగనమ్ముకోలేక, ఈలోగా వర్షం వస్తే ఆరుగాలం కష్టించి పండించుకున్న పంటంతా తడిసిపోయి.. చేతికందివచ్చిన పంట నోటిదాకా రాదేమోనని ఆందోళనతో రైతులు రాత్రిపగలు కంటికి కునుకు లేకుండా రోడ్లపక్కన ఆరబోసుకునివున్న వేరుశనగ రాశులకు కాపలా కాస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ సీజన్‌లో వేలాది ఎకరాల్లో వేరుశనగ పంటను రైతులు సాగుచేసుకుని ఉన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ దాదాపూ ఇదే దుస్థితి. ప్రభుత్వం, అధికారులు వెంటనే తమ బాధలు గుర్తించి వేరుశనగను గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేసేవిధంగా ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుకుంటున్నారు. వేరుశనగ పంటను భద్రపరుచుకునేందుకు గోదాములు నిర్మించి భవిష్యత్తులోనైనా రైతులు కష్టాలను తీర్చేందుకు కృషి చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తున్నారు.

## ప్రభుత్వమే వేరుశనగ పంటను కొనాలి

**- రైతుసంఘాల అభ్యర్థన**

వేరుశెనగ పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు నష్టాలకు గురవుతున్నారని, జిల్లాలో రైతులు పండించిన వేరుశెనగ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జిల్లా రైతు సంఘాల సమాఖ్య నాయకులు చిరసాని కోటిరెడ్డి, పులిగండ్ల శ్రీరాములు, ఏవిఆర్ నాయుడు, ఎం.మాలకొండారెడ్డిలు ఈనెల 6న ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నెలరోజుల క్రితం వేరుశెనగ 40 కిలోల బస్తా ధర 2500 రూపాయల వరకు ఉంటే ఇప్పుడు దళారులు 1200 రూపాయల లోపే అడుగుతున్నారని, కనీస మద్దతు ధర వందకిలోల బస్తాకు 5,275 రూపాయలైతే, అందులో సగం కూడా రైతులకు ఇవ్వడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు సాగు ఖర్చులు పెరగడం, మరోవైపు వాతావరణ పరిస్థితుల మార్పుతో దిగుబడి తగ్గడంతో వేరుశెనగ రైతుల పరిస్థితి అయోమయంలో పడిందని, ప్రభుత్వం ఈ దుస్థితిని గమనించి వేరుశెనగ పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వారు కోరారు.

### కోవిడ్ కేర్ సెంటర్లపై..

# కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలి

## - సిఎం వైయస్ జగన్ ఆదేశం



జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు ప్రతిరోజు 104 కాల్ సెంటర్లకు, జిల్లా కోవిడ్ సెంటర్లకు మాక్ కాల్స్ చేసి ఎక్కడైనా ఉదాసీనత ఉందా అనే విషయాన్ని నిరంతరం తెలుసుకోవాలని, కోవిడ్ బాధితుల పట్ల ఎంతో అప్రమత్తంగా ఉంటూ కోవిడ్ నియంత్రణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఈనెల 8వ తేది ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి సిఎం వైయస్ జగన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలు, జాయింట్ కలెక్టర్లతో సమావేశమై కోవిడ్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కోవిడ్ నిర్ధారణ పరీక్షలు జరిగేలా చూడాలని, కోవిడ్ పరీక్షల కోసం బాధితులు ఎక్కడకి వెళ్లాలో తెలియని పరిస్థితి రాకూడదని పేర్కొన్నారు. హోం ఐసొలేషన్లలో ఉన్నవారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారికి ప్రభుత్వం అందిస్తున్న కిట్స్ అందుతున్నాయా లేదా చూడాలని, కోవిడ్ కేర్ సెంటర్లలో పారిశుద్ధ్యం నిర్వహణ, నాణ్యమైన భోజన వసతి, మందులు, వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా పరిశీలిస్తుండాలని చెప్పారు. కోవిడ్‌కు ముందు రాష్ట్రంలో కేవలం 3451 ఆక్సిజన్ బెడ్స్ ఉండగా, ఇప్పుడు 26,450 బెడ్స్ అందుబాటులోకి తెచ్చామన్నారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ, పింఛన్లు పంపిణీ నూరుశాతం జరిగేలా కలెక్టర్లు చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలు, రైతుభరోసా కేంద్రాల నిర్మాణాలు, వైయస్సార్ హెల్త్‌క్లినిక్‌ల నిర్మాణాలు ఈ నెలాఖరునాటికి పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమావేశానికి జిల్లా ఎమర్జన్సీ ఆపరేటింగ్ సెంటర్ నుంచి జిల్లా కలెక్టర్ కెవిఎస్ చక్రధర్‌బాబు, జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్, జాయింట్ కలెక్టర్ డా.ప్రభాకర్‌రెడ్డి, డిఆర్‌డిఏ పి.డి నాగేశ్వరరావు, డిపిఓ ధనలక్ష్మి, డ్వామా పి.డి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

### విపిఆర్ ఫౌండేషన్

# సిజిఎంగా పెంచలరెడ్డి



ప్రతిభగల అధికారిగా, సమర్ధత కలిగిన వ్యక్తిగా జిల్లాలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో అనేక పదవులలో పనిచేసి ఆ పదవులకే వన్నెతెచ్చి ఇటీవలే ప్రభుత్వ విధులనుండి పదవీ విరమణ పొందిన చల్లా పెంచలరెడ్డి ఇప్పుడు విపిఆర్ ఫౌండేషన్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టాడు. బుధవారం రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పెంచలరెడ్డికి ఆ బాధ్యతలు అప్పజెప్పాడు.

సౌమ్యుడిగా, నిజాయితీగల అధికారిగానే కాకుండా అంకిత భావం, క్రమశిక్షణ కలిగిన మానవతావాదిగా కూడా పెంచలరెడ్డికి మంచి పేరుంది. పెంచలరెడ్డికి 'లాయర్' శుభాకాంక్షలు.

### ముంబై ఎయిర్‌పోర్టు

# జీవీకె చేయి జారడం విచారకరం

## - సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



నెల్లూరు జిల్లా వాసి అయిన గునుపాటి వెంకటకృష్ణారెడ్డి(జీవీకే) ప్రముఖ కాంట్రాక్టర్‌గానే కాకుండా మౌలిక సదుపాయాల రంగంలోనూ ప్రసిద్ధి చెంది సుమారు 60 ఏళ్లకుపైగా కష్టపడి జీవీకే సంస్థను తీర్చిదిద్దారని, హైదరాబాద్‌లో నాలుగు స్టార్ హోటల్స్ నిర్మించి ఆతిధ్య రంగంలో ఉమ్మడి ఏపీకి ప్రత్యేక గుర్తింపుతెచ్చారని, జీవీకే సంస్థ బెంగళూరు ఎయిర్ పోర్టును కూడా నిర్మించిందని, అంతటి ప్రఖ్యాతి చెందిన జీవీకె సంస్థ ఇప్పుడు ముంబై ఎయిర్ పోర్టును వదులుకోవల్సిన పరిస్థితి ఏర్పడడం దురదృష్టకరమని మాజీమంత్రి, టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు.

దేశ వాణిజ్య రాజధాని ముంబైలో ఢిల్లీకి దీటుగా ఎంతో ప్రతిష్టాత్మకంగా అత్యద్భుతమైన ఎయిర్ పోర్టును జీవీకె రూపుదిద్దారని, ఇది దేశంలో ఒక తెలుగువాడు సాధించిన ఘనత అని ఆయన పేర్కొంటూ దేశంలోనే విలువలతో కూడిన సంస్థగా జీవీకే ఇన్‌ఫ్రాను ఆయన నిలబెట్టారని జీవీకెను కొనియాడారు. కానీ ఈ రోజు ముంబై ఎయిర్‌పోర్టును వదులుకోరావల్సిన పరిస్థితి వచ్చిందని, దక్షిణ భారతదేశ పారిశ్రామికవేత్తలను ఉత్తర భారతదేశంలో చిన్నచూపు చూస్తారని, దక్షిణ భారతీయుల్ని ఎదగనీయరని ఉన్న నానుడికి ఈ సంఘటన అద్దంపడుతోందని ఆయన పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థలు పన్నే కుట్రలకు జీవీకె వంటి అతి పెద్ద సంస్థలకు కూడా మినహాయింపు లేదనడానికి ఇంతకంటే పెద్ద ఉదాహరణ ఏం కావాలని ఆయన పేర్కొంటూ, ప్రతి తెలుగువాడు ముఖ్యంగా ప్రతి నెల్లూరీయుడు గర్వపడే స్థాయిలో నిర్మించిన ముంబై విమానాశ్రయాన్ని జీవీకె వదులుకోవలసి రావడం ఎంతో బాధాకరమైన విషయమని సోమిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

# నెల్లూరు కబుర్లు

## కొత్త జేసీ(రెవెన్యూ)గా హరేందిర ప్రసాద్



జిల్లా జాయింట్ కలెక్టర్ (రెవెన్యూ, రైతు భరోసా)గా 2015 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన ఎంఎన్ హరేందిర ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఈనెల 8న ఉత్తర్వులు జారీచేసింది. ఆంధ్రప్రదేశ్ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టమ్స్ అండ్ సర్వీసెస్ సిఇగా పనిచేస్తున్న ఆయన జేసీగా నెల్లూరుకు బదిలీ అయ్యారు. గతంలో ఏపి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, కెఆర్‌పురం సబ్‌కలెక్టర్‌గా కూడా ఆయన పనిచేసి ఉన్నారు. ఈయన త్వరలోనే కొత్త జేసీగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

## కమిషనర్‌గా దినేష్‌కుమార్, ఐఏఎస్



నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా అందరూ అనుకున్నట్లుగానే కొత్త ఐఏఎస్ అధికారి నియామకం జరిగింది. తెనాలి సబ్ కలెక్టర్‌గా ఉన్న కొత్తమాసు దినేష్‌కుమార్‌ను నెల్లూరు కార్పొరేషన్‌కు కమిషనర్‌గా బదిలీచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 8న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ స్థానంలో ఇటీవలి వరకు పనిచేసిన బాపిరెడ్డి గత ఆగస్టు 12న ప్రకాశం జిల్లాకు జేసీగా బదిలీ అయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జిల్లా కలెక్టర్‌గా ఉన్న చక్రధర్‌బాబు కూడా 2014లో నెల్లూరు కార్పొరేషన్‌కు కమిషనర్‌గా పనిచేసి ఉన్నారు. ఆరేళ్ళ తర్వాత ఇప్పుడు మళ్ళీ ఐఏఎస్ అధికారిని కార్పొరేషన్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించడం విశేషం. నెల్లూరు నగరపాలక సంస్థకు కమిషనర్లుగా వచ్చిన వారంతా రకరకాల కారణాలు, రాజకీయాల వత్తిళ్ళ దెబ్బకు తట్టుకోలేక ఇటొచ్చి అటు వెళ్ళిపోతుంటారనే అభిప్రాయం నెల్లూరీయుల్లో స్థిరపడి పోయింది. ఇప్పటికే పలువురు కమిషనర్లు కొద్దికాలం పనిచేసి బదిలీలపై వెళ్ళిపోయిన నేపథ్యంలో దినేష్‌కుమారైనా స్థిరంగా ఉండి నెల్లూరు నగర ప్రజల సమస్యలను ఒక కొలిక్కి తెస్తారని ఆశిద్దాం!..

## విజేతలకు బహుమతులు

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నెల్లూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు ఈనెల 6న నగరంలోని నవాబుపేటలో ఉన్న ఆర్‌ఎస్‌ఆర్ ఉన్నత పాఠశాలలో బహుమతులు అందజేశారు. లయన్స్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి కృష్ణకుమార్, సతీష్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌బాబు తదితరులు పాల్గొని విజేతలైన విద్యార్థులను అభినందించి బహుమతులందించారు.

### 20 నుంచి 26 దాకా..

## సచివాలయ పరీక్షలు

**1550 పోస్టులకు**
**54వేల దరఖాస్తులు**

జిల్లాలో ఈనెల 26 నుంచి 26వ తేది వరకు జరగనున్న గ్రామ, వార్డు సచివాలయ పరీక్షలకు జిల్లా అధికారయంత్రాంగం సమాయత్తమైంది. జడ్పీ సిఇఓ, పరీక్షల కన్వీనర్ సుశీల ఆధ్వర్యంలో అధికారులు ఇప్పటికే పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తిచేశారు. 1550 పోస్టులకు దాదాపు 54వేల మంది దాకా ఈ పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు నిర్వహించే అధికారులు, సిబ్బందికి తగు శిక్షణ కూడా ఇస్తున్నారు.

### ఇన్‌చార్జి డిఎంఅండ్‌హెచ్‌ఓగా

## వెంకటప్రసాద్

డిఎంఅండ్‌హెచ్‌ఓగా పనిచేస్తున్న రాజ్యలక్ష్మి సెలవుపై వెళ్ళడంతో ఆ స్థానంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్ ఇన్‌చార్జిగా నియమితులై ఈనెల 8న బాధ్యతలు తీసుకున్నారు. కోవిడ్ నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆయన అధికారులు, సిబ్బందికి సూచించారు.

### విజయవంతంగా

## సంపూర్ణ లాక్‌డౌన్



కరోనా నియంత్రణలో భాగంగా జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఆదేశాల మేరకు ఈ నెల 6న నిర్వహించిన సంపూర్ణ లాక్‌డౌన్ విజయవంతమైంది. వ్యాపారులు దుకాణాలు మూసివేశారు. నెల్లూరు నగరంలోని వీధులన్నీ నిర్మానుష్యమయ్యాయి. ప్రజలు ప్రభుత్వ నిబంధనల మేరకు లాక్‌డౌన్‌కు సహకరించి అత్యవసరమైతే తప్ప ఇళ్ళలోంచి బయటకు రాకపోవడంతో సంపూర్ణ లాక్‌డౌన్ విజయవంతమైంది.

## అర్హులందరికీ 'వైయస్సార్ ఆసరా'

**- డిఆర్‌డిఏ ఇన్‌చార్జి పి.డి నాగేశ్వరరావు**

జిల్లాలో అర్హులైన స్వయంసహాయక సంఘాల సభ్యులందరికీ వైయస్సార్ ఆసరా పథకం అందేలా తగు చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఏ ఇన్‌చార్జి పి.డి నాగేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 7న ఆయన నెల్లూరులోని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న డిఆర్‌డిఏ సమావేశమందిరంలో నిర్వహించిన సమావేశంలో అధికారులతో మాట్లాడుతూ ఈనెల 11న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని, ఇందులో భాగంగా జిల్లాలోని 39,105 స్వయం సహాయక సంఘాలకు నాలుగు విడతలుగా నిధులు విడుదల చేస్తారని, జిల్లాలో తొలివిడతగా 296.56 కోట్లు విడుదలవుతాయని, అదేరోజు వారి బ్యాంకు ఖాతాల్లో ఆ డబ్బు జమ అవుతుందని, అర్హులందరికీ ఆ మొత్తం అందేలా చర్యలు చేపట్టాలని తెలియజేశారు.

## మూడవసారి తండ్రీ కొడుకుల ప్లాస్మా దానం

నెల్లూరుకు చెందిన తండ్రీ కొడుకులు చలువాది కృష్ణప్రసాద్, షణ్ముఖ సాయి ఈనెల6న కరోనా బాధితులను ఆదుకునేందుకు మూడవసారి కూడా ప్లాస్మా దానం చేసి అందరి అభినందనలు అందుకున్నారు. ఈ సందర్భంగా నగరంలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కొన్నాళ్ళ క్రితం వారు కరోనా బారినపడి కోలుకుని కరోనాను జయించారని, వీరిద్దరూ మూడుసార్లు ప్లాస్మాదానం చేసి తద్వారా ఆరుగురు రోగులకు ప్రాణదానం చేయడం ఎంతో సంతోషకరమని అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్‌జైన్, కమిటీ సభ్యులు బయ్యా ప్రసాద్, యడవల్లి సురేష్, డాక్టర్ యశోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడం హర్షణీయం

**- తాళ్లపాక రమేష్‌రెడ్డి**



తెలుగుజాతి కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జీవిత చరిత్రను తెలంగాణా ప్రభుత్వం పాఠ్యాంశాల్లో చేర్చడం ఎంతో అభినందనీయమని అఖిలభారత ఎన్టీఆర్ అభిమానుల సంఘం అధ్యక్షుడు తాళ్లపాక రమేష్‌రెడ్డి ఈనెల 6న ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తెలుగుజాతి విశిష్టతను ఎన్టీఆర్ దశదిశలా చాటారని, ఆ మహానేత చరిత్రను ఆంధ్రరాష్ట్రంలోనూ పాఠ్యాంశాల్లో చేర్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేయాలని ఆయన కోరారు. మహోన్నత నేత.. నటరత్న నందమూరికి భారతరత్న బిరుదును ప్రదానం చేయాలని ఆయన ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## జర్నలిస్టులకు ఎల్లవేళలా ప్రభుత్వ సహకారం

**ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్**




జర్నలిస్టులకు ఎల్లవేళలా ప్రభుత్వ సహకారం ఉంటుందని నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్ అన్నారు. ఈనెల 7న ఆయన నెల్లూరు ప్రెస్‌క్లబ్ వద్ద సంజీవని బస్సు ద్వారా జిల్లాలోని పలువురు జర్నలిస్టులకు, వారి కుటుంబసభ్యులకు కరోనా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ ఏర్పాటు చేశామన్నారు. పోలీసులు, పారిశుద్య కార్మికులు, ఆరోగ్యసిబ్బందితో పాటు జర్నలిస్టులు కూడా ఈ కరోనా విపత్తు సమయంలో విధులు నిర్వహిస్తూ ప్రజలను ఈ వ్యాధి పట్ల అప్రమత్తం చేస్తూ కరోనా కట్టడికి కృషిచేస్తుండడం అభినందనీయమన్నారు. ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్ మాట్లాడుతూ పలువురు జర్నలిస్టులు ఈ కరోనా సమయంలో విధులు నిర్వహిస్తూ ప్రాణాలు కోల్పోతున్నారని, వారి కుటుంబాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మధుబాబు, సయీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## 15 దాకా లాక్‌డౌన్

కరోనా వైరస్ నియంత్రణలో భాగంగా ఈనెల 15వ తేది వరకు లాక్‌డౌన్ పొడిగిస్తూ కలెక్టర్ చక్రధర్‌బాబు ఆదేశాలు జారీచేశారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సడలింపు ఉంటుందని, ఆ తర్వాత లాక్‌డౌన్ కొనసాగుతుందని ఈనెల 7న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని వ్యాపారులు స్వచ్ఛందంగా కరోనా కట్టడికి లాక్‌డౌన్‌కు ముందుకు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తగు జాగ్రత్తలు తీసుకుంటే కరోనాను కట్టడి చేయవచ్చని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో, ప్రత్యేకించి నెల్లూరు నగరంలో కోవిడ్ పాజిటివ్ కేసులు పెరుగుతున్నందువల్ల లాక్‌డౌన్ పొడిగిస్తున్నామన్నారు. ఈనెల 6న ఆదివారం ఒక్కరోజు నెల్లూరులో సంపూర్ణ లాక్‌డౌన్ అమలుచేయడం వల్ల కోవిడ్ పాజిటివ్ కేసులు గణనీయంగా తగ్గాయన్నారు. కోవిడ్ బారినపడకుండా ముందుజాగ్రత్తలు పాటిస్తే మరిన్ని ఫలితాలు వస్తాయన్నారు.

## బిసి సంక్షేమ భవనాలకు 5.4 కోట్లు

**- జేసీ ప్రభాకర్‌రెడ్డి**

జిల్లా బిసి సంక్షేమ కార్యాలయం, బిసి భవన్ నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం 5.4 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు నగరంలోని కొండాయపాళెం గేటు కూడలిలో ఉన్న జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారి కార్యాలయాన్ని ఆయన ఈనెల 7న పరిశీలించి, నూతన భవన నిర్మాణాలకు ప్రతిపాదనల గురించి అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ అధికారి వెంకటయ్య, అధికారులు ప్రసన్న, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

## విద్యుత్ మీటర్ల విధానం విరమించాలి



రాష్ట్రంలో రైతులకు నష్టం కలిగించేలా ఉన్న విద్యుత్‌మీటర్ల విధానాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆదేశాలతో కాంగ్రెస్ నాయకులు ఈనెల 8న జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులకు ఉచితంగా ఇచ్చే విద్యుత్‌కు మీటర్లు అమర్చడం దారుణమని, ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు మానుకొని రైతులకు అండగా నిలవాలన్నారు. జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ఏటూరి శ్రీనివాసులురెడ్డి, సేవాదళ్ అధ్యక్షుడు కొండా అనిల్‌కుమార్, నాయకులు గొట్టిగుండాల మహేష్‌రెడ్డి, షేక్ అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మందులషాపులపై దాడులు

నెల్లూరు నగరంలోని నారాయణ, మెడికవర్, రిచ్ తదుపరి ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్న మందులషాపులపై ఈనెల 7న వాణిజ్య పన్నుల శాఖ అధికారులు దాడులు చేసి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆ శాఖ జాయింట్ కమిషనర్ కల్పన మాట్లాడుతూ కోవిడ్ నేపథ్యంలో అధికధరలకు మందులు అమ్మడం, బిల్లులు లేకుండానే మందులను విక్రయించడమే కాక భారీ స్థాయిలో వ్యాపారాలు చేస్తూ పన్నులు సక్రమంగా చెల్లించడం లేదనే ఆరోపణలు రావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ దాడులు చేశామన్నారు. వినియోగదారులకు బిల్లులు సక్రమంగా ఇస్తున్నారా లేదా?.. పన్నులు చెల్లిస్తున్నారా లేదా అనే విషయాలను పరిశీలిస్తున్నామన్నారు. రికార్డుల పరిశీలన అనంతరం తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## న్యాయ విచారణ చేయాలి

రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి దేవాలయాల్లో దాడులు జరుగుతున్నాయని, హిందూ ఆలయాలపై జరుగుతున్న ఘటనలను హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని టిడిపి మాజీ కార్పొరేటర్, బ్రాహ్మణ సంఘం నాయకుడు ఉచ్చి భువనేశ్వరిప్రసాద్ డిమాండ్ చేశాడు. నెల్లూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన ఈనెల 7న ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్వేది, కొండబిట్రగుంటల్లో రథాలను తగులబెట్టిన తీరు ఒకే విధంగా ఉండడం అనుమానాలకు తావిస్తోందన్నారు. రథాలను తగులబెట్టినవారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. దేవాలయాలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం విచారణ జరపకుండా నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన విమర్శించారు. సత్యనాగేశ్వరరావు, మామిడాల మధు పాల్గొన్నారు.

# ప్రజల ముంగిళ్ళకే ప్రభుత్వ పథకాలు

**- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల ముంగిళ్లలోకే అందిస్తోందని వైయస్సార్‌సీపి బాపట్ల, తిరుపతి పార్లమెంట్ నియోజక వర్గాల పరిశీలకుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల8న ఆయన జిల్లాలోని వాకాడు, కోట, చిట్టమూరు మండలాల వైయస్సార్‌సీపి నాయకులు, కార్యకర్తలతో వాకాడులోని తన నివాసంలో సమావేశమై ప్రభుత్వ పథకాల అమలు తీరును సమీక్షించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పరిపాలనను ప్రజలకు చేరువ చేస్తూ గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టి ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్నారని కొనియాడారు. తాజాగా వైయస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ప్రవేశపెట్టడం ఎంతో సంతోషదాయకమన్నారు. పాలనలో జాతీయస్థాయిలో బెస్ట్ సిఎంగా జగన్మోహన్‌రెడ్డి మూడవస్థానంలో నిలిచారని గుర్తుచేశారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొడవలూరు దామోదర్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, వేమారెడ్డి షణీల్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, గూడూరు వెంకటేశ్వర్లురెడ్డి, నేదురుమల్లి హరీష్‌చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

**టిడిపి నాయకుల ఆరోపణ**



ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైందని టిడిపి నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అబ్దుల్ అజీజ్‌లు ఆరోపించారు. ఈనెల 7న నెల్లూరులోని అజీజ్ నివాసంలో పలువురు నాయకులతో కలసి వారు కొన్ని గంటలపాటు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా ప్రభుత్వం అన్యాయం చేస్తోందని, దళారులు రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పుట్టికి 16వేల రూపాయలు ఇవ్వడం జరిగిందని, వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత దళారులు కేవలం 9 వేలకే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. జిల్లాలో సుమారు 8 లక్షల పుట్లకు పైగానే ధాన్యం పండితే ప్రభుత్వం ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులను దళారులు దోచుకుంటున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వమే రైతుల వద్ద నుంచి నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రతి రైతుకు గిట్టుబాటుధర కల్పించాలని కోరారు. పుట్టికి 5వేల వంతున రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు ధర్మవరపు సుబ్బారావు, చెంచయ్య, శాంతినాయుడు, సాబిర్, తెలుగు మహిళ అధ్యక్షురాలు రేవతి తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్టు రమణారెడ్డి మృతి

జిల్లాలోని మనుబోలుకు చెందిన సీనియర్ జర్నలిస్టు బొర్రెడ్డి వెంకటరమణారెడ్డి(43) అనారోగ్యంతో ఈనెల 7న మృతి చెందాడు. పలు పత్రికల్లో పనిచేసిన ఆయన గత పదిరోజులుగా అనారోగ్యంతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయన మృతికి విచారం తెలుపుతూ స్థానిక ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ బాబూ మోహన్‌దాస్ తదితరులు ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

# కరోనాను ఐక్యంగా ఎదుర్కోవాలి

జిల్లాలో కరోనా వ్యాధి విజృంభిస్తున్న ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో అందరూ ఐక్యంగా ఉండి కరోనా మహమ్మారిని ఎదుర్కోవాలని మాజీమంత్రి, టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈనెల 7న ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. జిల్లాలో కరోనా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందని, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని కరోనా కట్టడికి కృషిచేస్తూ అందరికీ భరోసా కల్పించాలన్నారు. ఆసుపత్రుల్లో కరోనా బాధితుల పట్ల పర్యవేక్షణ లోపించిందని, కొన్ని వైద్యశాలల్లో భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయని, పేద కుటుంబాలు ఈ కరోనా కష్టకాలంలో ఆర్థికంగా మరింత చితికిపోకుండా ఆసుపత్రుల యజమానులు మంచిమనసుతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. కరోనా బాధితుల పట్ల ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని, వారికి తమవంతు సాయం అందించాలని అన్నాడు. నెల్లూరు పెద్దాసుపత్రిలో ఒక మహిళ ఆత్మహత్య చేసుకోవడం విషాదకరమన్నారు.

# డ్వామా పీడీగా సాంబశివారెడ్డి

జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌గా సాంబశివారెడ్డి ఈనెల 9న నెల్లూరులోని డ్వామా కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. చిత్తూరుజిల్లా ఇన్‌చార్జి డిపిఓగా ఉన్న ఆయన్ను ఇటీవల డ్వామా పీడీగా బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల వర్షాలతో ఉపాధి పనులు మందగించాయని, త్వరలోనే ఉపాధిహామీ పనులను పెద్దఎత్తున చేపట్టనున్నట్లు చెప్పారు. చిన్న, సన్నకారు రైతులకు, పండ్లతోటల రైతులకు ఉపాధి హామీ నిధులు మంజూరు చేస్తామన్నారు.

# శ్రీసిటీలో మాక్ ఫైర్ సేఫ్టీ

**- భద్రతపై అవగాహన కలిగించిన అగ్నిమాపక సిబ్బంది**



శ్రీసిటీ అగ్నిమాపక సిబ్బంది ఈనెల 5న శ్రీసిటీలోని జెన్ లినెన్ పరిశ్రమలో మాక్ ఫైర్ సేఫ్టీ ప్రదర్శన నిర్వహించారు. అగ్నిమాపక పద్ధతులు, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా ఎలా స్పందించాలన్న అంశాలపై కార్మికులకు అవగాహన కలిగించడంలో భాగంగా ఆయా పరిశ్రమల కార్మికులు, ఇతర సిబ్బందికి మాక్ సేఫ్టీ డ్రిల్ ద్వారా అవలంభించాల్సిన భద్రతా విధానాలను వివరించారు. ఈ కార్యక్రమం సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ మాక్ ఫైర్ సేఫ్టీ ప్రదర్శన నిర్వహణ ద్వారా భద్రత పట్ల కార్మికులకు, సిబ్బందికి అవగాహన కలిగించినందుకు అగ్నిమాపక సిబ్బందిని అభినందించారు. జన్ లినెన్ పరిశ్రమ డైరెక్టర్ మిలింద్ ముంగికర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఎంతో అవసరమని, అత్యవసర పరిస్థితుల్లో ఎలా వెంటనే స్పందించాలో అవగాహన కలిగించారని అగ్నిమాపక సిబ్బందిని కొనియాడారు. శ్రీసిటీ అగ్నిమాపక అధికారి ఎమ్ఎన్ఏ బాషా, సత్యవేడు అగ్నిమాపక అధికారి డి.భాస్కరరెడ్డి, అగ్నిమాపక సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# శ్రీసిటీని సందర్శించిన ఏపిఐఐసి అధికారులు

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపిఐఐసి) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.ప్రతాప్‌రెడ్డితో పాటు ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ రత్నాకర్, ఏపిఐఐసి డెప్యూటీ జోనల్ మేనేజర్ జవహర్‌బాబు ఈనెల 5న శ్రీసిటీ సందర్శనకు రాగా వారికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీకి భవిష్యత్తులో రానున్న ప్రాజెక్టులకు సంబంధించి భూ కేటాయింపులపై అధికారులు రవీంద్ర సన్నారెడ్డితో చర్చించారు. అనంతరం వారు సిఐటిసి, పానాసోనిక్ పరిశ్రమల యాజమాన్యంతో సమావేశమై, శ్రీసిటీ ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ జోన్లో నిర్మాణంలో వున్న వారి యూనిట్ల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు.




## బతుకుతెరువు కోల్పోయి..

# రోడ్డునపడ్డ 'సీజన్‌బాయ్'లు



*'సీజన్‌బాయ్'... ఈ పదం నెల్లూరు వ్యాపారవర్గాల్లో కీలకం. వారిపాలిట ఎంతో ఉపయుక్తం కూడా. ఫ్యాన్సీ, మెడికల్, ఎలక్ట్రికల్ వ్యాపారాల్లో సీజన్‌బాయ్‌ల ప్రాముఖ్యత చాలా ఎక్కువగా ఉంటుంది. ఏ షాపుకు, ఏ సామాగ్రి అవసరమో అర్ధరాత్రి ఆర్డర్లు తీసుకుని తెల్లవారి చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైల్లో చెన్నైకి బయలుదేరి ఆ సాయంత్రానికల్లా మళ్ళీ నెల్లూరుకు కావాల్సిన సరుకులను చేరవేసే చక్కని వ్యవస్థ.. సీజన్‌బాయ్‌లది.*

వినియోగదారులకు కావాల్సిన ఫ్యాన్సీ, మందులు, ఎలక్ట్రికల్ వస్తువులు అందించే సీజన్‌బాయ్‌లు తమకొచ్చే కమీషన్లతోనే జీవితాన్ని గడుపుతుండడం మనం చూస్తున్నదే. ఇందులో కూడా కొంతమంది చేసే వ్యాపారాన్ని 'సీజన్ వ్యాపారం'గా కూడా సంబోధిస్తుంటారు. వాళ్ళే పెట్టుబడి పెట్టి షాపులవాళ్లకు కావాల్సిన సామగ్రిని అందుబాటులోకి తెచ్చి స్వల్పలాభంతో అదో వ్యాపారంగా ఉపాధిని పొందేవాళ్ళు మన నెల్లూరులోను, సూళ్ళూరుపేట, నాయుడుపేటల్లో ఎక్కువమంది ఉండడం విశేషం.

ఈ సీజన్‌బాయ్స్ వ్యవస్థ వల్ల వినియోగదారులకు వస్తువులు లభించే విధానం చాలా సులభతరంగా ఉంటుంది. వ్యాపారస్తులకు తక్కువ పెట్టుబడితో వ్యాపారం కొనసాగించడం సాధ్యమయ్యేది. అయితే, కరోనాతో ఒక్కసారిగా ఆ వ్యవస్థ కుప్పకూలిపోయింది. రవాణా సౌకర్యాలు ముఖ్యంగా రైళ్ళు లేకపోవడంతో ఎంతో తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో వస్తువులు చెన్నై నుంచి సూళ్ళూరుపేట, నాయుడుపేట, నెల్లూరుకు వస్తువులు చేరవేసే ఈ విధానం గత ఏడునెలలుగా స్తంభించిపోయింది. దీంతో ఈ పనుల్లో జీవిస్తున్న వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

వినియోగదారుడికి కావాల్సిన వస్తువుల లభ్యతలోను ఎంతో తేడా ఉంది. అవసరానికి కావాల్సిన సరుకులు అందడం ఇప్పుడు గగనమైపోయింది. వ్యాపార టర్నోవరు ఒక్కసారిగా కుప్పకూలిపోయే ప్రమాద స్థితికి చేరుకుంది. దీంతో సీజన్‌బాయ్‌ల బతుకుల్లో కరోనా మహమ్మారి నిప్పులు పోసింది. వారి ఉపాధికి గండి కొట్టింది. ఇప్పుడు ఈ సీజన్‌బాయ్స్ బతుకుతెరువు కోల్పోయి దుర్భరజీవితం గడుపుతున్నారు.

కరోనా వైరస్ కారణంగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా చెన్నైకి వెళ్ళే రైళ్ళు లేక రవాణా వ్యవస్థ స్తంభించడంతో సీజన్‌బాయ్స్ పని కోల్పోయి పస్తులతో గడుపుతుండడం దారుణం.. దయనీయం!.. వాళ్ల సంచారంతో పరుగులు పెడుతున్న వ్యాపారం ఒక్కసారిగా కుంటుపడిపోయింది. అవసరమైన మందులు కూడా సరిగ్గా దొరక్క రోగులు అవస్తలు పడుతున్నారు. ఈ వ్యవస్థ మళ్ళీ పుంజుకోవాలంటే రైల్వే రవాణా మళ్ళీ ప్రారంభం కావాల్సి ఉంది. మనకు అతిదగ్గరలో ఉన్న చెన్నై ఎంతో దూరాభారమైంది. కొన్ని ప్యాసింజరు రైళ్ళు నడిపితే మళ్ళీ చెన్నై మనకు దగ్గరవుతుంది. అక్కడి నుండి కావాల్సిన వస్తువులు నెల్లూరుజిల్లా మార్కెట్‌లో మళ్ళీ తళుక్కుమంటాయి. దేశమంతా రైళ్ళు నడిచినా నెల్లూరు నుంచి చెన్నైకి రైల్వే రవాణా వ్యవస్థ లేకపోవడం శోచనీయం.

మద్రాసు మహానగరం ఇప్పుడిప్పుడే నిద్ర మేల్కొంటోంది. సిటీ బస్సులు, మెట్రో రైళ్ళు వేగం పుంజుకుంటున్నాయి. అన్‌లాక్‌లో భాగంగా షాపులన్నీ తెరుచుకుంటున్నాయి. సీజన్ వ్యాపారులంతా ఎప్పుడెప్పుడా అని ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఒక పచ్చజెండా ఊపడమే తరువాయి. ఈ కరోనా కష్టకాలం నుంచి సీజన్‌బాయ్‌లు కొంతమేరకైనా బయటపడినట్లవుతుంది.



# గూడూరు డివిజన్ వార్తలు

## ప్రశాంతినగర్ సమస్యలు పరిష్కరిస్తాం



ఈనెల 5వతేదీ గూడూరు పట్టణం, 25వవార్డు న్యూగాంధీనగర్‌లోని ప్రశాంతినగర్‌లో ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు పర్యటించాడు. ఈ సందర్భంగా ప్రశాంతి నగర్ వాసులు తమ సమస్యలు చెప్పుకుంటూ... తాము చాలా సంవత్సరాలుగా గుడిసెలలో ఉంటున్నామని, ప్రభుత్వం ద్వారా ఇళ్లు మంజూరు చేయాలని, కాలనీలో రోడ్లు, డ్రైనేజి వ్యవస్థ, త్రాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చాడు. పట్టణ వైసిపి అధ్యక్షులు బొమిడి శ్రీనివాసులు, పార్టీ నాయకులు మనోహర్‌గౌడ్, నరసయ్య, వినీష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



గూడూరు పట్టణంలోని పలు సమస్యలను పరిష్కరించాలంటూ మున్సిపల్ కమిషనర్ ఓబులేసుకు ఇటీవల వినతిపత్రం సమర్పిస్తున్న ఇన్సాఫ్ కమిటి గూడూరు డివిజన్ అధ్యక్షుడు షేక్ జమాలుల్లా, పట్టణ అధ్యక్షుడు సయ్యద్ నయీమ్, కార్యదర్శి షేక్ ఉమర్, కోశాధికారి షేక్ కబీర్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు సునీల్ మాదాల, శశికుమార్ తదితరులు.

## ప్రముఖ న్యాయవాది లేఖరాజు హఠాన్మరణం



గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని చెన్నూరు గ్రామానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది లేఖరాజు ప్రభాకర్ రావు మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. గూడూరు కోర్టులో గత ఇరవైఏళ్లుగా ఆయన లాయర్‌గా విధులు నిర్వహిస్తూ ఎనలేని సేవలు అందించాడు. సీనియర్ న్యాయవాది యరగుడిపాటి చలపతిరావు దగ్గర ఆయన జూనియర్‌గా పనిచేశాడు. అందరితో కలివిడిగా వుండే ఆయన సాటి వారితో ఆప్యాయంగా మెలుగుతూ మంచి మనసున్న వ్యక్తిగా పేరుపొందిన ప్రభాకర్‌రావు అకస్మాత్తుగా మరణించడంతో వారి కుటుంబసభ్యులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. యరగుడిపాటి చలపతిరావు, బార్ అసోసియేషన్ మెంబర్లు ప్రభాకర్‌రావు కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

## శ్రీకంటికి ఐసీఏఐ ప్రశంసాపత్రాలు









ప్రముఖ ఆడిటర్, ఎస్.వి.రత్నం ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీకంటి రామమోహన్‌రావుకు ఇటీవల న్యూఢిల్లీకి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా రెండు ప్రశంసాపత్రాల్ని అందించింది. కరోనా కాలంలో పీఎం కేర్ ఫండ్, సబ్‌కలెక్టర్ కార్యాలయానికి కోవిడ్ రోగుల కోసం నిధులు అందించడం, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పోలీసులకు మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేసినందుకు, అదేవిధంగా రెడ్‌జోన్ ప్రాంతాలలో ఆహార పంపిణీ తదితర కార్యక్రమాలను నిర్వహించినందుకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా వారు ఈ ప్రశంసాపత్రాల్ని ఆయనకు అందజేశారు. రామమోహన్‌రావు స్పందిస్తూ ఇటువంటి ప్రశంసాపత్రాలు తనపై మరింత బాధ్యతను పెంచుతాయని, తన శక్తి మేరకు ఆపన్నులను ఆదుకుంటానన్నాడు. ఈ సందర్భంగా శ్రీకంటికి సన్నిహితులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు.

## ఏపీజేట్రస్ట్ ఆధ్వర్యంలో ఫ్లాస్కుల పంపిణీ



ఏపీజే అబ్దుల్ కలామ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల ఫ్లాస్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు సయ్యద్ తాజుద్దీన్ మాట్లాడుతూ కరోనా సమయంలో నిరుపేదలకు వేడినీళ్ల తాగేందుకు ఉపయోగకరంగా మీనాక్షి సుందరం సహకారంతో పది ఫ్లాస్కులను పంపిణీ చేసినట్లు తెలిపాడు. అలాగే కరోనాతో బాధపడుతున్న కొంతమంది నిరుపేదలకు నగదు సాయం, కూరగాయలు, బియ్యం, నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమాలను నిర్వహించామన్నాడు. దీనిని దృష్టిలో ఉంచుకుని సబ్‌కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, తహశీల్దార్ లీలారాణి, కమిషనర్ ఓబులేసు, సీఐ దశరధరామారావుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకోవడం సంతోషంగా ఉందన్నాడు. ఫ్లాస్కుల పంపిణీకి దాతగా వ్యవహరించిన మీనాక్షి సుందరానికి కృతజ్ఞతలు తెలిపాడు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓతోపాటు పలువురు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఫ్లాస్కులు పంపిణీ చేశారు. విశ్రాంత జైలర్ వై.శ్రీనివాసులు పాల్గొన్నారు.

### ఎస్సీ, ఎస్టీల సమస్యలపై..

## ప్రభుత్వం దృష్టి సారించాలి



**- ఏపి షెడ్యూల్డు కులాల రాష్ట్ర అధ్యక్షుడు నాగిశెట్టి ధర్మయ్య**

రాష్ట్రంలో ఎస్సీల మీద నానాటికీ పెరిగిపోతున్న అకృత్యాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, పరంపరగా ఎస్సీలపై అగ్రకులాలే కాకుండా భారత రాజ్యాంగ వెలుగులో ఎస్సీలను రక్షించాల్సిన పోలీసులు కూడా అసాధారణ రీతిలో వేధించడం, హత్య కేసులను తారుమారు చేయడం వంటి చర్యలను ఖండిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంఘం అధ్యక్షుడు నాగిశెట్టి ధర్మయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉత్తరాల ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామని, నెల్లూరుజిల్లా, బాలాయపల్లి మండలం భైరవరం గ్రామంలో కయ్యూరు శ్రీనివాసులు అనే దళితుడిని హత్య చేయించిన అగ్రకులస్తులపై ఎస్సీ, ఎస్టీ(అత్యాచారాల నిరోధక) యాక్ట్‌తో పాటు హత్యానేరం కింద కేసులు నమోదు చేయాలని, ఈ విషయంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన పోలీసుల మీద కూడా ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసు కోవాలని కోరాడు. అన్ని జిల్లాల్లోనూ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఆఫ్ అట్రాసిటి ఎగైనెస్ట్ ఎస్సీ అండ్ ఎస్టీస్‌లలో ఏ పొలిటికల్ పార్టీలో సభ్యులుగా లేని దళిత నాయకులను సభ్యులుగా నియమించాలని, నెల చివరిరోజున ప్రతి జిల్లాలోనూ, ప్రతి మండలంలో ఒక గ్రామంలో నిర్వహించాల్సిన సివిల్ రైట్స్‌డే నిర్వహించని అధికారులకు ఛార్జి మెమోలు ఇవ్వాలని, చట్టప్రకారం నిర్వహించాల్సిన నియోజకవర్గ స్థాయి ఎస్సీ, ఎస్టీ సదస్సులను ప్రతి సంవత్సరం నిర్వహించాలని, మండల మరియు డివిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలను కూడా రాజకీయపార్టీలకు అతీతంగా నియమించాలని, ఎస్సీ, ఎస్టీ యాక్ట్ బోర్డులను ప్రతి తహశీల్దార్ కలెక్టరేట్, సబ్‌కలెక్టరేట్ ఆఫీసుల వద్ద ప్రదర్శించాలని కోరాడు. ఎస్సీ ఎస్టీ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం అందించే సహాయసహకారాలు వెంటనే అందించాలని, రెవెన్యూ ఆఫీసులలో పెండింగ్‌లో వున్న ఎస్సీ ఎస్టీలకు చెందిన భూముల దురాక్రమణకు సంబంధించిన కేసులను వెంటనే పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేయించి కేసులను నమోదు చేయాలని, తప్పుడు కేసులు పెట్టే ఎస్సీ, ఎస్టీలపై కూడా తగు విధంగా కేసులుపెట్టి శిక్షించాలని, అన్ని ప్రభుత్వ కార్యక్రమాలనూ కేవలం అగ్రకుల ధనికులకు పరిమితం చేయకుండా ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులకు కూడా తెలియజేసి అందరి భాగస్వామ్యం ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపాడు.



8వ వర్ధంతి

మా తల్లి గారైన
శ్రీకంటి సుబ్బరత్నమ్మ గారు
దైవ సన్నిధికి చేరి 8సం॥లు గడిచినా
మీ జ్ఞాపకాలు మా మదిలో
చిరస్థాయిగా నిలిచే ఉంటాయి.
మీ పవిత్రాత్మకు శాంతి కలగాలని
భగవంతుని ప్రార్థిస్తూ...

స్వర్గీయ శ్రీకంటి సుబ్బరత్నమ్మ గారు
W/o లేట్ S.V. రత్నం గారు
కవి & ఆడిటర్, గూడూరు.

కుమారులు - కోడళ్ళు
శ్రీకంటి రామమోహన్‌రావు - రాజ్యలక్ష్మి
శ్రీకంటి రమణమూర్తి - సీతమ్మ
- శ్రీకంటి మాలతి
కుమార్తెలు - అల్లుళ్ళు
యరగుడిపాటి వసంత - ప్రభాకరరావు
మద్దాలి వసుప్రద - వెంకట కృష్ణారావు
కారుమంచి ఇందిర -

మనుమరాలు - మనుమడు
వెంకట మంజుప్రీతి - కామేశ్వర్
ముని మనుమడు : ఆర్యన్

## మీ ప్రాణాలు.. మీ చేతుల్లోనే




**- మయూరి శ్యామ్‌యాదవ్**

శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, అంతర్జాతీయ మానవ హక్కులు మరియు నేర వ్యతిరేక సేవా సంస్థ రాష్ట్ర కార్యదర్శి, మాజీ గుంతకల్ రైల్వే డివిజన్ డిఆర్‌యుసిసి మెంబర్ మయూరి శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో గూడూరు గమళ్లపాలెంలో ఉన్న ఓం సాయిరాం చారిటబుల్ ట్రస్ట్‌లోని సుమారు 40 మంది వృద్ధులకు ప్రతినెలా జరిగే అన్నదాన కార్యక్రమం ఈ నెల 7వ తేదీ జరిగింది. ఈ సందర్భంగా మయూరి శ్యామ్‌యాదవ్ వృద్ధులనుద్దేశించి మాట్లాడుతూ మీరందరూ 60 సంవత్సరాలు పైబడినవారు కాబట్టి, ఈ కోవిడ్ వైరస్ నుండి మీ ప్రాణాలు కాపాడుకోవటం మీ చేతుల్లోనే ఉందని, మీరందరూ ధైర్యంగా ఉండి కనీసం మూడు గంటలకు ఒకసారి చేతులను శుభ్రపరుచుకోవడం, బయటకు రాకుండా ఆశ్రమంలోనే వుండడం, ఒకవేళ అత్యవసర పరిస్థితిలో బయటకు వచ్చినా తప్పనిసరిగా మాస్క్, లేదా చేతి రుమాలును ముక్కుకు, నోటికి కట్టుకోవాలని, మీరు మీ ముందు ఉన్న మనిషికి సుమారు ఆరు అడుగుల దూరంలో ఉండాలని, జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్ళు నొప్పులు, రుచి తెలియకపోవడం, ఇవన్నీ ఎక్కువ రోజులు ఉండి తగ్గకపోతే వెంటనే హాస్పిటల్‌కు వెళ్లి కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయుంచుకోవాలని చెప్పాడు. శ్రీ కృష్ణ సేవాసమితి ద్వారా చేసే ప్రతి కార్యక్రమం ఆ దేవదేవుడు శ్రీకృష్ణ పరమాత్ముని ఆశీస్సులతో మా సంస్థలైన మయూరి స్వీట్స్, మయూరి ఐస్‌క్రీమ్స్, వనజాకృష్ణ కల్యాణ మండపం ఆధ్వర్యంలో జరుగుతున్నాయన్నాడు. ఈ కార్యక్రమంలో పునుగు ఆనందు, ఆశ్రమం నిర్వాహకులు కళ్యాణి పాల్గొన్నారు.

# పెరిగిన నిమ్మ ధరలు

## - కోలుకుంటున్న రైతులు



కరోనా నేపథ్యంలో ఇటీవలి దాకా రవాణా సౌకర్యాలు సక్రమంగా లేక, గిట్టుబాటు ధరలు లేక అలమటిస్తున్న జిల్లాలోని నిమ్మరైతులు ఎట్టకేలకు ఆ నష్టాల సుడి నుంచి కోలుకుంటున్నారు. నిమ్మకాయల బస్తా ధర 500 రూపాయలకు కూడా అమ్ముడు పోవడం లేదని, అడిగినవారికి 200 రూపాయలకు కూడా బస్తా నిమ్మకాయలను అమ్ముకోవాల్సి వస్తోందని బాధపడుతున్న రైతులు ఇప్పుడు ధరలు పెరగడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిమ్మ మార్కెట్‌లో నిమ్మకాయల లూజుబస్తా ధర ఈనెల 6న 1400 నుంచి 2500 రూపాయల దాకా పలకడంతో రైతులు నష్టాల నుంచి కోలుకుంటూ..నిమ్మకాయల ఎగుమతిలో తలమునకలై ఉన్నారు. ఇరుగు పొరుగు రాష్ట్రాలకు రవాణా సౌకర్యాలు కొంతమేరకు మెరుగుపడడంతో గత రెండుమూడు రోజులుగా ఇక్కడి నుంచి చెన్నై, కోయంబత్తూరు, మధురై, బెంగుళూరు తదితర దూరప్రాంతాల మార్కెట్లకు జిల్లా నుంచి నిమ్మకాయలు రవాణా చేసేందుకు వీలు కలగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో నిమ్మకాయలు లేకపోవడంతో మన జిల్లాలోని గూడూరు, పొదలకూరు తదితర ప్రాంతాల నిమ్మకాయలకు డిమాండ్ ఏర్పడిందని, అయితే ఇక్కడ కూడా పెద్దసంఖ్యలో నిమ్మకాయలు లేకున్నా, ప్రస్తుతం తోటల్లో ఉన్న వాటికి మాత్రం మంచి ధరే లభిస్తోందని, సీజన్‌లోనైతే కనీసం పాతిక లారీల దాకా నిమ్మకాయల ఎగుమతి జరుగుతుండేదని, ఇప్పుడు రోజూ మూడు నాలుగు లారీల నిమ్మకాయలను మాత్రమే ఇతర ప్రాంతాలకు పంపగలుగుతున్నామని, ప్రస్తుతానికి ధరలు ఆశాజనకంగానే ఉన్నాయని రైతులు చెప్తున్నారు.

### మానవత్వం చాటుకున్న

## నాయుడుపేట పారిశుద్ధ్య సిబ్బంది

కరోనా అనుమానిత మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు నాయుడుపేట మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులు. మునిసిపాలిటీ పరిధిలోని పిచ్చిరెడ్డితోపులో ఓ వ్యక్తి ఈనెల 6న తన నివాసంలో మరణించాడు. అయితే కరోనా అనుమానంతో ఆ వ్యక్తి బంధువులు కానీ, స్థానికులు కానీ అంతిమ సంస్కారాలు చేసేందుకు ముందుకు రాకపోవడంతో ఈ విషయం తెలుసుకున్న మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు పారిశుద్ధ్యకార్మికులు ఎంతో ధైర్యంగా వచ్చి ఆ మృతదేహాన్ని పట్టణానికి దూరంగా తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. కరోనా విపత్కర సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కరోనా అనుమానిత వ్యక్తికి మానవతా హృదయంతో అంత్యక్రియలు నిర్వహించినందుకు మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డిని, పారిశుద్ధ్య కార్మికులను అందరూ అభినందిస్తున్నారు.

# ప్రతి వందమందిలో 18 మందికి కోవిడ్

జిల్లాలో కోవిడ్ పరీక్షలు చేయించుకుంటున్న ప్రతి వందమందిలో 18 మందికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అవుతోందని, అయితే 99 శాతం మంది బాధితులు కరోనా నుంచి కోలుకుంటున్నారని, మరణాలు ఒక్కశాతం లోపే ఉన్నాయని, ఆ మరణాలను కూడా తగ్గించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు అన్నారు. ఈనెల 7న ఆయన కోవిడ్ కారణంగా మృతిచెందినవారి మృతదేహాలను దహనం చేసే విద్యుత్, గ్యాస్ ఆధారిత సంచార శవదహన యంత్రాన్ని నగరంలోని రెడ్‌క్రాస్ కార్యాలయం ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోజూ కనీసం 7వేల మందికి పైగానే కోవిడ్ పరీక్షలు నిర్వహించి 24 గంటల్లోనే ఫలితాలు అందజేయడం జరుగుతోందని, కోవిడ్ లక్షణాలు ఉన్నవారిని, వయస్సు పైబడిన వారిని కోవిడ్ ఆసుపత్రులకు, కోవిడ్ కేర్ సెంటర్లకు తరలిస్తున్నామని, ఎలాంటి లక్షణాలు లేనివారిని ఇళ్లలోనే హోం ఐసొలేషన్‌లలో ఉంచుతున్నామని చెప్పారు. కరోనా తీవ్రత ఈ నెలాఖరుకు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామని, కోవిడ్ నియంత్రణకు

### ➢ 99 శాతం కోలుకుంటున్నారు

**- కలెక్టర్ చక్రధర్‌బాబు**



రెడ్‌క్రాస్ కార్యాలయ ఆవరణలో సంచార శవదహన యంత్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

ప్రజలు స్వీయ నియంత్రణ పాటించాలని, మాస్కులు ధరించడం, సామాజిక దూరం పాటించడం, రెండుపూటలా స్నానం చేయడం, తరచూ సబ్బుతో చేతులో శుభ్రం చేసుకుంటూ ఉండడం తదితర ముందుజాగ్రత్తలు తీసుకుంటుండాలన్నారు. కరోనా కట్టడికి సంబంధించి రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా యూనిట్ అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మెన్ దామిశెట్టి సుధీర్ నాయుడు, కోశాధికారి సురేష్‌జైన్, సభ్యులు గునపాటి ప్రసాద్‌రెడ్డి, బయ్యా ప్రసాద్, యడవల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### దహన సంస్కారాలకు ఎలక్ట్రానిక్ క్రిమేటర్ :

కోవిడ్ వైరస్‌తో మృతిచెందిన వారి మృతదేహాల దహన సంస్కారం కోసం జిల్లా కలెక్టర్ సూచనల మేరకు రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా మొబైల్ ఎలక్ట్రానిక్ క్రిమేటర్‌ను నెల్లూరు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తున్నామని, ఈ అత్యాధునిక పరికరాన్ని కోయంబత్తూరులో తయారుచేయించామని, దీనిద్వారా 750 సెంట్రీగ్రేడ్‌ల ఉష్ణోగ్రతతో 60 నిమిషాల లోపు మృతదేహం పూర్తిగా దహనమవుతుందని రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మెన్ పి. చంద్రశేఖర్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఈ అధునాతన పరికరం నెల్లూరులోని బోడిగాడితోట స్మశానవాటికలో అమర్చబడుతుందన్నారు.

## గండిపేట సుధీర్‌కు అవార్డు

తిరుపతిలోని వే ఫౌండేసన్ అనే సంస్థ నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాళెంలోని దొడ్ల పద్మిని ఉమామహేశ్వరి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్‌కు 'ఉత్తమ ఉపాధ్యాయ' అవార్డును బహుకరించింది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయనకు ఈ అవార్డును బహుకరించారు. ఈ సందర్భంగా సుధీర్‌ను స్థానిక ఉపాధ్యాయులు, ఆయన సహచరులు అభినందించారు.

### విశ్వ ధర్మపరిరక్షణ సంస్థ

## జిల్లా అధ్యక్షునిగా ప్రసాద్‌శర్మ

ఉదయగిరి మండలంలోని గండిపాళెంకు చెందిన లోకా వెంకటప్రసాద్ శర్మ నియమితులయ్యారు. ఈనెల 5న విజయవాడలో జరిగిన ధర్మపరిరక్షణ వేదిక సదస్సులో ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు పరమపూజ్య శ్రీ శివస్వామి చేతులమీదుగా ఆయన నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా విశ్వ ధర్మపరిరక్షణ సభ్యులు ప్రసాద్‌శర్మను అభినందించారు.

### పరమశివునికి ఉదయకిరణాల అభిషేకం...

# గండవరం.. ఉదయకళేశ్వరాలయం

భక్తుల కొంగుబంగారంగా, కోరిన కోర్కెలు నెరవేర్చే దైవంగా గండవరం ఉదయకళేశ్వరస్వామి ప్రసిద్ధి. చల్లటి సుప్రశాంత వాతావరణంలో ఈ ఆలయం కొలువై ఉంటుంది. నిత్యం ఎంతోమంది భక్తులు ఆలయానికి వచ్చి భక్తవరదుడైన ఉదయకళేశ్వరస్వామిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని పూజలు చేస్తుంటారు.

**ఆలయ చరిత్ర :**

శ్రీ ఉదయకళేశ్వరస్వామి ఆలయానికి ఎంతో ప్రాచీనమైన చరిత్ర ఉంది. పూర్వకాలంలో నెల్లూరును పాలించిన పల్లవ రాజులు, చోళ రాజులు ఎంతో పరాక్రమవంతులుగా ఉండేవారు. వారి పరాక్రమానికి గుర్తుగా 'గండ' అనే బిరుదు అప్పట్లో వాడుకగా ఉంది. వీరులను గండరగండడు అని కూడా అంటుండేవారు. ఆలయంలోని దాన శాసనాల ఆధారంగా ఈ ఆలయం క్రీ.శ 1150 నాటికే ఉందని, ఈ ఆలయాన్ని చోళరాజులు నిర్మించారని ఉంది. జిల్లాలో గండగోపాలపురం అనే గ్రామం ముత్తుకూరు మండలంలో నాటి గండగోపాలుడనే పరాక్రమవంతుని పేరుతో నేటికీ ఉంది. అలా బిరుదు పొందిన చోళరాజు ఒకరు తన పేరుమీద నిర్మించిన ఈ ఊరికి గండవరం అని, ఇక్కడ అత్యద్భుతమైన శైలితో ఈ ఆలయాన్ని చోళరాజులే నిర్మించి ఉంటారని చెప్తుంటారు. తెలతెలవారుతుండగా సూర్య భగవానుని లేతకిరణాలు తొలుత ఈ ఆలయంలోని లింగ రూపుడైన పరమేశ్వరుని ఆరాధిస్తున్నట్లుగా స్వామివారిని తాకుతున్న దృశ్యం భక్తులకు కన్నులపండువ చేస్తుంది. దేశంలోని సూర్యదేవాలయాల్లో ప్రఖ్యాతమైన కోణార్క దేవాలయంలో కూడా ఇలాంటి దృశ్యమే కనిపించి భక్తులను పరవశుల్ని చేస్తుంటుంది. ఎంతో విశాలమైన ఈ ఆలయంలో ఉన్న శిల్పాలు,



**మన దేవాలయాలు (12)**

***నెల్లూరు జిల్లాలోని పురాతనమైన దేవాలయాల్లో కొడవలూరు మండలం గండవరం గ్రామంలో వెలసి ఉన్న గంగా పార్వతీ సమేత శ్రీ ఉదయకళేశ్వరస్వామి దేవాలయం ఒకటి. ఈ ఆలయంలో లింగస్వరూపుడై ఉన్న పరమశివునికి నిత్యం ప్రభాతవేళ సూర్యదేవుని ప్రథమ కిరణాలు స్వామివారికి కిరణాభిషేకం చేస్తున్నట్లుగా స్వామివారిని తాకుతుంటాయి. ఆ కిరణాల స్పర్శతో పరమశివుడు తన్మయుడైపోతుంటాడు. ఈ దృశ్యం భక్తులకు నేత్రపర్వం. అదే ఈ ఆలయం ప్రత్యేకత. అందుకే స్వామివారికి ఉదయకళేశ్వరునిగా పేరు వచ్చిందని ప్రతీతి. మరికొందరు ఉదయకాళేశ్వరుడిగా కూడా కొలుస్తుంటారు.***

ఆలయం గర్భగుడి వగైరాలన్నీ ఎంతో అద్భుతంగా ఉంటాయి. చోళరాజుల కాలం నాటి శిల్పుల కళాచాతుర్యం సాటిలేనిదిగా అనిపిస్తుంది. అలాంటి ఎంతో అపురూపమైన.. అద్వితీయమైన ఈ ఆలయ నిర్మాణం మన జిల్లాలో ఉండడం ఎంతో విశేషం కూడా.

నిత్యం భక్తుల రాకపోకలతో కళకళలాడుతున్న ఉదయకళేశ్వరాలయం జిల్లా ఆధ్యాత్మిక వికాసాన్ని పెంపొందింపజేస్తూ నేటికీ దివ్యంగా అలరారుతోంది.

**చోళరాజుల కాలంలో ఆలయ అభివృద్ధి :**

క్రీ.శ 1182 ప్రాంతంలో నెల్లూరు ప్రాంతాన్ని పాలించిన మనుమ గండగోపాలుడనే రాజు ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేశాడంటారు. త్రిభువన చక్రవర్తిగా బిరుదాంకితుడైన కుళోత్తుంగ చోళదేవ మహారాజు నాటి కాలంలో ఈ ఆలయానికి భూరి విరాళాలిచ్చి ఆలయాన్ని మరింత శోభాయమానం చేశాడని చరిత్ర. ఇందుకు సంబంధించి తెలుగు, తమిళ భాషలో శాసనాలు కూడా ఉన్నాయి. పల్లవ రాజులు కూడా ఈ ఆలయం అభివృద్ధికి పెద్దఎత్తున విరాళాలు ఇచ్చి ఆలయం మరింతగా దేదీప్యమానంగా ఉం డేందుకు ఎంతగానో దోహదం చేశారని చెప్తుంటారు.

**ఏటా వైభవంగా బ్రహ్మోత్సవాలు :**

ఉదయకళేశ్వరునికి నిత్యపూజలు, కైంకర్యాలతో పాటు మాఘమాసం ఏడు రోజులపాటు ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతుంటాయి. ఆశ్వీయుజ మాసంలో నవరాత్రుల పర్వదినాలు నేత్రపర్వంగా నిర్వహిస్తుంటారు. ఉదయకళేశ్వరస్వామిని ఆరాధిస్తే ఎంతటి దీర్ఘవ్యాధులైనా తగ్గిపోతాయని, ఎన్ని కష్టాలైనా ఇట్టే తొలగిపోతాయని ప్రతీతి. అందుకే భక్తులు స్వామివారి బ్రహ్మోత్సవాల్లో వేలాదిగా పాల్గొంటూ తమ మొక్కుబడులు చెల్లించుకుంటూ ఉంటారు. జిల్లా నుంచే కాక రాష్ట్రం నలుమూలల నుంచి, తమిళనాడు తదితర దూరప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుని తరిస్తుంటారు.

# నిల్ ఊరేనా?

(మొదటి పేజీ తరువాయి)

చరిత్రాత్మకమైన నెల్లూరుజిల్లా చరిత్రలో కలసిపోనుందన్నది వారి భావన. పార్లమెంటరీ నియోజకవర్గాల ప్రాతిపదికగా జిల్లాల పునర్విభజన చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన. ఇప్పుడున్న పార్లమెంటు నియోజకవర్గాల ప్రకారం యధాతధంగా అది అమలు జరిగితే నెల్లూరుకు తీరని నష్టమే జరుగుతుంది. సూళ్లూరుపేట, సర్వేపల్లి, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాలు బాలాజీ జిల్లాకు వెళ్లిపోతాయి.

## చేజారి పోనున్న వెంకటగిరి 'జరీ'

వెంకటగిరి... జరీ చీరలకు పెట్టింది పేరు. ఇక్కడనుండి విదేశాలకు సైతం జరీ చీరల ఎగుమతి జరుగుతుంటుంది. అనాదిగా ఈ చీరలు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. అనేక చేనేత కుటుంబాలు తరతరాలుగా ఈ వ్యాపారాన్ని జీవనోపాధిగా చేసుకుని జీవిస్తున్నాయి. కొన్ని కోట్ల రూపాయల వస్త్ర వ్యాపారానికి కేంద్ర బిందువు వెంకటగిరి. ఇప్పుడా రాబడి అంతా బాలాజీ జిల్లాకు వెళ్ళిపోతుంది. ఇక జిల్లాలో ఇప్పటికీ తమ ఉనికిని చాటుకుంటున్న రాజ కుటుంబం వెంకటగిరి రాజాలది, తమ ప్రాభవానికి, తమ వైభవానికీ ఎక్కడా లోటు రానీయకుండా తమ కీర్తిని పెంచుకుంటున్న కుటుంబం వారిది. ఇప్పుడా కుటుంబం కూడా మరో జిల్లాలోకి వెళ్ళిపోతుంది.

## పారిశ్రామిక ప్రగతికి రాచబాటలు వేస్తున్న సూళ్లూరుపేట

తడ ప్రాంతంలో శ్రీసిటీ ముఖద్వారం. శ్రీహరికోటలో ప్రపంచ ప్రఖ్యాత షార్ రాకెట్ కేంద్రం, మేనకూరు, చింతవరం ప్రాంతాల్లో పారిశ్రామిక వాడలు , పులికాట్ సరస్సు, పక్షుల పండుగ ఇవన్నీ సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఓ భాగం. పునర్విభజనలో సూళ్లూరుపేట బాలాజీ జిల్లాకు వెళ్తే జిల్లాలోవున్న ఒకే ఒక పారిశ్రామిక ప్రాంతం మొత్తం తరలిపోయినట్లే. కొన్ని వందల మంది ఉద్యోగులతోపాటు వేలకోట్ల పెట్టుబడులు, వందలకోట్ల రాబడులు జిల్లా దాటి పోయినట్లే.

## సిలికా, మైకా గనులకు పెట్టినూరు గూడూరు

గూడూరు నియోజగవర్గం మొత్తం సంపదమయం. అనాదిగా వస్తున్న మైకా గనులతో పాటు ఇప్పుడు సిలికా నిధులకు నెలవు గూడూరు ప్రాంతం. ఇటీవల కాలంలో వేల కోట్ల వ్యాపారం ఇక్కడ జరిగింది. కొన్ని దశాబ్దాలుగా నిమ్మ పంటకు కూడా గూడూరు ప్రాంతం ప్రసిద్ధి. ఇక్కడనుండి దేశ విదేశాలకు నిమ్మకాయల ఎగుమతి జరుగుతుంది. ఇప్పుడు పునర్విభజనలో గూడూరు కూడా బాలాజీ సొంతమే.

## సర్వేపల్లితో సర్వం సమర్పణం

అటు తడ నుండి ఇటు మైపాడు వరకు వంద కిలోమీటర్లకు పైగా తీర ప్రాంతం నెల్లూరు జిల్లాకు ఒక వరం. ఇప్పుడు సూళ్లూరుపేటతో పాటు సర్వేపల్లి కూడా పునర్విభజనలో కోల్పోతే ఇక జిల్లాకు మిగిలేది శూన్యమే. ఇక్కడ అంతర్జాతీయ వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న కృష్ణపట్నం పోర్టు, ఆ పోర్టును అనుసంధానం చేస్తూ ఇచ్చిన వేల ఎకరాల పారిశ్రామిక వాడ, మరో జిల్లా పరిధిలోకి వెళ్లిపోతాయి. ఇక్కడితో సర్వం సమర్పయామి. ఇప్పుడనుకున్నవన్నీ యధాతధంగా జరిగితే జిల్లా ఆర్థిక మూలాల నడుము విరిచేసినట్లే. జిల్లాలోని మిగిలిన ప్రాంతాలలో ఏ విధంగా చూసినా ఆర్థిక ప్రయోజనాలు తక్కువే, ఆర్థిక వనరులు సమకూర్చే వనరులు కూడా కరువే.

## నెల్లూరు.. ఇక.. 'నిల్లూరే'

ప్రాచీనకాలంలో 'నెల్లి' చెట్టు క్రింద శివుడు స్వయంభువుగా వెలిసిన ప్రాంతం కాబట్టి 'నెల్లి ఊరు'గా అవతరించి, కాలక్రమంలో 'నెల్లూరు'గా మారిందని కొంతమంది, అలాగే తమిళంలో వరిని 'నెల్లి' అని పిలుస్తారు కాబట్టి ధాన్యానికి ప్రసిద్ధి చెందిన ఊరుగా ఈ ఊరికి ఆ విధంగా కూడా 'నెల్లి ఊరు' అని పేరు వచ్చి, ఆ తర్వాత కాలంలో 'నెల్లూరు'గా మారిందని మరికొంతమంది చెప్తున్న తరుణంలో... ఇప్పుడు ఉన్నవన్నీ పోగొట్టుకుని 'నెల్లూరు' రాబోయే రోజుల్లో 'నిల్లూరు'(నిల్ ఊరు)గా మారుతుందేమోనని నెల్లూరోళ్ళు ఆవేదన చెందుతున్నారు.

జిల్లాల పునర్విభజన ప్రక్రియను అధ్యనం చెయ్యడానికి ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీని నియమించింది. 2021 మార్చిలోగా ఈ ప్రక్రియను పూర్తి చెయ్యాలని గడువు విధించింది. వైసిపికి 2014లో 8, 2019లో పదికి పదీ సీట్లు గెలిపించిన నెల్లూరుకు జగన్ అన్యాయం చెయ్యడన్నది జిల్లా వాసుల ఆశ. ఒకవేళ అదే జరిగితే ఉద్యమాల పురిటి గడ్డ నెల్లూరులో 'జై ఆంధ్రా' తరహాలో 'జై నెల్లూరు' అంటూ మరో ఉద్యమం పురుడు పోసుకుంటుందనడంలో సందేహం లేదు.

## కాలధర్మం

## రాయిపూడి దేవదానం



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు రాయిపూడి దేవదానం(96) ఈనెల 8వ తేది వేకువన నెల్లూరులో మరణించారు. ప్రజాస్వామ్య ఉద్యమాల్లో తనదైన పాత్ర పోషించి ఆయన అందరికీ స్ఫూర్తిదాయకంగా ఉండేవారు. చిన్ననాటి నుంచే జాతీయ భావాలతో ఉండేవారు. స్వాతంత్ర్యపోరాటంలోనూ పాల్గొని దేశస్వాతంత్ర్యం కోసం పోరాటం సాగించారు. ఆ తర్వాత కాలంలో నెల్లూరులోని కపాడిపాళెం కౌన్సిలర్గా కూడా పనిచేసి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూ స్థానికులందరి ప్రశంసలందుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి రాష్ట్ర అధ్యక్షునిగా కూడా తన సేవలందించారు. ఆయన మరణం జిల్లాకు తీరని లోటని అంటూ ఆయన కుటుంబసభ్యులకు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

# మరో అద్భుత సృష్టి

(మొదటి పేజీ తరువాయి)

హైపర్ సోనిక్ టెక్నాలజీలో అగ్రదేశాల సరసన భారత్ కూడా నిలిచింది. క్షిపణి ప్రయోగాల్లో సరికొత్త హైపర్‌సోనిక్ శకంలోకి భారత్ అడుగుపెట్టింది. డిఆర్‌డిఓ ఛైర్మన్‌గా నెల్లూరీయుడైన మన సతీష్‌రెడ్డి సారథ్యంలో ఈ అద్భుతసృష్టి జరగడం ఎంతైనా విశేషం. అగ్రదేశాలకు ధీటుగా ఈ ఆధునిక క్షిపణిని పరీక్షించడం ఓ సంచలనాత్మక విజయం. దేశీయంగా అభివృద్ధి చేసిన స్క్రామ్‌జెట్ ప్రొపల్షన్ వ్యవస్థ ఆధారితమైన హైపర్ సోనిక్ టెక్నాలజీ డిమాన్‌స్ట్రేటర్ వెహికల్‌ను ఒడిసాలోని బాలాసోర్ తీరం నుంచి మన డిఆర్‌డిఓ శాస్త్రవేత్తలు ఈనెల 7న విజయవంతంగా పరీక్షించి తమ ప్రతిభాపాటవాలను చాటుకున్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ వెహికల్‌ను రూపొందించి డిఆర్‌డిఓ శాస్త్రవేత్తలు హైపర్‌సోనిక్ టెక్నాలజీపై తమకున్న సత్తాను చాటుకున్నారు. ఈ ఘనత అంతా డిఆర్‌డిఓ ఛైర్మెన్, మన నెల్లూరీయుడైన గుండ్రా సతీష్‌రెడ్డికి, డిఆర్‌డిఓ శాస్త్రవేత్తలకు లభించడం మనకే కాదు.. దేశానికే గర్వకారణం.

అగ్రదేశాలకు ధీటుగా హైపర్‌సోనిక్ టెక్నాలజీలో స్వయం సమృద్ధి సాధించేందుకు మనదేశం మార్గం సుగమం చేసుకుంటోంది. ప్రధానంగా చైనా ముప్పును ఎదుర్కొనేందుకు ధీటుగా భారత్ అన్ని విధాలా సమాయత్తమవుతోంది. ఈ నేపథ్యంలో భారత్ ఇప్పుడు మరో ముందడుగు వేసింది. చైనాకి ధీటుగా ఆధునిక క్షిపణి టెక్నాలజీని భారత్ విజయవంతంగా పరీక్షించి నాలుగో హైపర్‌సోనిక్ దేశంగా సగర్వంగా నిలిచింది. ఈ ప్రయోగ విజయం ద్వారా ప్రపంచంలో హైపర్ సోనిక్ సాంకేతిక పరిజ్ఞానం సాధించిన నాలుగో దేశంగా భారత్ నిలిచింది. డిఆర్‌డిఓ నేతృత్వంలో అత్యంత అధునాతనమైన హైపర్ సోనిక్ వెహికల్‌ను ఈనెల 7న ప్రయోగాత్మకంగా పరిశీలించి విజయాన్ని సాధించడంతో దేశవ్యాప్తంగా సంతోషం వ్యక్తమవుతోంది. ఒడిసా తీరానికి సమీపంలో ఉన్న వీలర్ దీవిలోని ఏపిజె అబ్దుల్ కలామ్ లాంచ్ కాంప్లెక్స్ నుంచి ఈనెల 7వతేది ఉదయం 11గంటలా 3 నిమిషాలకు హెచ్‌ఎస్‌టిడివి నింగిలోకి విజయవంతంగా దూసుకెళ్ళడంతో ఈ పరీక్ష అద్భుత విజయాన్ని సాధించినట్లు రక్షణ మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది. దీంతో కొత్తతరం క్షిపణుల రూపకల్పనకు మార్గం సుగమం అయినట్లేనని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

## పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానం

ఈ పరీక్ష విజయవంతం కావడంతో, శత్రువుపై మెరుపువేగంతో విరుచుకుపడే క్షిపణులు, వైమానిక వ్యవస్థల రూపకల్పనపై భారత్ అద్వితీయమైన రీతిలో ముందడుగు వేసినట్లే. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో హైపర్ సోనిక్ టెక్నాలజీ డిమాన్‌స్ట్రేషన్ వెహికల్ (హెచ్‌ఎస్‌టిడివి)ని డిఆర్‌డిఓ రూపొందించడం విశేషం. దీంతో హైపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణులను అభివృద్ధి చేసే పరిజ్ఞానం కలిగిన దేశాలైన అమెరికా, రష్యా, చైనా దేశాల సరసన భారత్ చేరడం ఒక అద్భుతం. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఓ) దేశీయంగానే ఈ టెక్నాలజీని అభివృద్ధి చేసి అందరి అభినందనలు అందుకుంది. ధ్వని కన్నా ఆరు రెట్ల వేగంతో, అంటే సెకనుకు రెండు కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్ళే (మ్యాక్-6) దీర్ఘశ్రేణి క్షిపణులు, వైమానిక వ్యవస్థలకు ఇంజిన్‌గా హెచ్‌ఎస్‌టిడివి ఉపయోగపడుతుందని, ప్రస్తుతం అనేక క్షిపణుల్లో వాడుతున్న రామ్‌జెట్ సాంకేతికతకు భిన్నంగా ఈ సాధనంలో 'స్క్రామ్‌జెట్' పరిజ్ఞానాన్ని వినియోగించడం ఎంతైనా విశేషమని నిపుణులు అంటున్నారు. అగ్ని క్షిపణిలో వాడే ఇంధన మోటారుకు క్రూయిజ్ వాహనాన్ని అనుసంధానించి ఈ తాజా ప్రయోగాన్ని దిగ్విజయంగా మన శాస్త్రవేత్తలు నిర్వహించడం ఎంతైనా అద్భుతం!..

## శాస్త్రవేత్తలకు అభినందనలు

'భవిష్యత్తులో అత్యంత క్లిష్టమైన పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు, ఎక్కువ కాలం పనిచేసే ఇంజిన్ రూపకల్పనకు ఈ పరీక్ష ఎంతగానో దోహదపడుతుందని' డిఆర్‌డిఓ ఛైర్మెన్, మన నెల్లూరీయుడైన గుండ్రా సతీష్‌రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. 30 కిలోమీటర్ల ఎత్తులో సెకనుకు రెండు కిలోమీటర్ల వేగంలో దాదాపు 20 సెకన్ల పాటు దీనిని పరీక్షించామని, అగ్ని క్షిపణికి ఇది మరింత శక్తినిస్తుందని చెప్పారు. 30 కిలోమీటర్ల ఎత్తులో ఏరోడైనమిక్ హీట్ షీల్డ్‌ల నుంచి విడివడి ఈ వెహికల్ దూసుకెళ్ళిందని, మాక్-6 వేగంతో 20 సెకన్లపాటు ప్రయాణించిందని చెప్పారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఓ శాస్త్రవేత్తలందరికీ మన సతీష్‌రెడ్డి అభినందనలు తెలియజేశాడు.

అదేవిధంగా, భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్ర మోడీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు ఈ సందర్భంగా డిఆర్‌డిఓ శాస్త్రవేత్తలను అభినందించారు. ప్రధాని నిర్దేశించిన 'ఆత్మ నిర్భర్ భారత్' కింద స్వయం సమృద్ధి సాధనలో ఇదో మైలురాయి అని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. డిఆర్‌డిఓ శాస్త్రవేత్తలను చూసి దేశం గర్విస్తోందన్నారు.

# బాధితులు 3 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆవేదన కలిగిస్తోంది. ఆ తర్వాత కూడా ఈ వ్యాధి మరెంతగా విజృంభిస్తుందోననే ఆందోళన అందరిలో ఉంది.

కొన్ని నెలల క్రితం కరోనా అంటే ఎక్కడో వస్తుంది.. మన దాకా రాదులే అనుకున్నవారంతా ఇప్పుడు కరోనా విజృంభణ చూసి వణికిపోతున్నారు. ఎక్కడ చూసినా కరోనా రాకాసి విలయతాండవం చేస్తుంటే దిక్కుతోచని స్థితిలో ప్రజలు విలవిలలాడిపోతున్నారు. ఇప్పటికే కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య రోజురోజుకూ లక్షల సంఖ్యలో పెరిగిపోతుండడమే కాక, ఇప్పటిదాకా 9 లక్షలా 4వేలా 710 మంది మృత్యుఒడికి చేరుకున్నారు. ఇంకా ప్రతిరోజూ ఈ వ్యాధి లక్షలాదిమదికి సోకుతూనే ఉండడం ప్రపంచ మానవాళిని తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. ఒక వ్యాధి ఇంతపెద్ద సంఖ్యలో ప్రజలకు సోకుతూ ప్రపంచాన్ని నిలువెల్లా వణికించడం, అన్ని దేశాలూ ఈ కరోనా ధాటికి ఎక్కడికక్కడ స్తంభించిపోతుండడం, ఆర్థికస్థితిగతులన్నీ ఛిన్నాభిన్నం అవుతుండడం ప్రపంచంలో ఇదే ప్రధమం.

ప్రపంచవ్యాప్తంగా కరోనా ఉధృతి కొనసాగుతుండడంతో కేసుల సంఖ్య ప్రతి పదివేల జనాభాలో 3571 మంది కరోనా బాధితులవుతున్నారని, 116 మంది ప్రాణాలు కోల్పోతున్నారని తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయితే, కరోనా నుంచి కోలుకునేవారి సంఖ్య కూడా ఆశాజనకంగానే ఉంది. ఇప్పటిదాకా 1.99కోట్ల మంది కరోనా నుంచి కోలుకున్నారని, మరో 70.20 లక్షలమంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, వీరిలో 60,434 మంది పరిస్థితి విషమంగా ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు పేర్కొంటున్నాయి. అగ్రరాజ్యం అమెరికాలో 65.21 లక్షల కేసులు నమోదు కాగా ఇప్పటి దాకా 1.94 లక్షల మంది చనిపోయారు. అదేవిధంగా బ్రెజిల్‌లో 41.79 లక్షల మందికి వైరస్ సోకితే 1.28 లక్షలమంది మృత్యువాత పడ్డారు. రష్యాలో 10.41 లక్షల మందికి కోవిడ్ వైరస్ సోకింది. ఇలా అన్నిదేశాల్లోనూ రోజురోజుకీ కరోనా సోకుతూ ఆయా దేశాల్లో ప్రజలను అల్లకల్లోలం చేస్తూనే ఉంది.

## రెండవ స్థానంలోకి భారత్

కరోనా బాధితుల్లో మనదేశం రెండవ స్థానంలోకి వచ్చింది. ఇప్పటిదాకా భారత్‌లో 43 లక్షల మందికిపైగానే కోవిడ్ వైరస్ బారినపడ్డారు. 73 వేల మంది దాకా మరణించారంటే దేశంలో కరోనా విజృంభణ ఎంతగా కొనసాగుతోందో తేటతెల్లమవుతోంది. దేశంలో ఈనెల 9వ తేది బుధవారం నాటికి మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 43,70,128 కాగా, మరణించిన వారి సంఖ్య 73,890. అయితే క్రమేణా ఈ వ్యాధి నుంచి కోలుకుంటున్నవారి సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతూనే ఉండడం సంతోషదాయకం. ఇప్పటిదాకా మనదేశంలో ఈ వ్యాధి నుంచి కోలుకున్నవారు 33,98,844 మంది కాగా, మరో 8,97,394 మంది ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ గణాంకాలు చెప్తున్నాయి. దేశంలో ఈ వ్యాధితో కోలుకుంటున్నవారు శాతం 77.77 కాగా, మరణాల శాతం 1.67శాతంగా ఉంది. మహారాష్ట్రలో అత్యధికంగా 9,43,772 మందికి కరోనా సోకగా, 27,407 మంది ప్రాణాలు కోల్పోయారు. 6,72,556 మంది కోలుకుంటున్నారు. ఆ తర్వాత తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలు కోవిడ్ బాధితుల్లో రెండు, మూడు స్థానాలకు చేరుకున్నాయి. ఏదేమైనా ఈ వ్యాధి నియంత్రణకు స్వీయనిర్బంధంలో ఉంటూ ప్రభుత్వాలు పేర్కొంటున్న అనేకరకాల ముందుజాగ్రత్తలు పాటిస్తూ ఉండడం ద్వారా కరోనాను కట్టడి చేయవచ్చు. ప్రజలంతా ఆ నిబంధనలు పాటించడం ద్వారా కరోనా బారి నుండి మనల్ని మనం కాపాడుకోవచ్చు.

## జిల్లా జర్నలిస్టులతో ఉపరాష్ట్రపతి వెంకయ్య మాటామంతీ

# పులకరింపజేసిన పలకరింపు



'ఈ కరోనా సమయంలో మీరెలా ఉన్నారు' అంటూ భారత ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు జిల్లాలోని జర్నలిస్టులను ఆత్మీయంగా పలకరించడంతో జర్నలిస్టులు పులకరించిపోయారు. కరోనా కష్టకాలంలో ఎవరూ ప్రత్యేకించి తమ యోగక్షేమాలను విచారించకపోయినా దేశంలో ఎంతో అత్యున్నతస్థానంలో ఉన్న ఉప రాష్ట్రపతి తమను ఆప్యాయంగా పరామర్శించడంతో మీడియా ప్రతినిధులు ఎంతగానో సంతోషించారు.

జిల్లాలోని పాత్రికేయులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో ఈనెల 6వ తేది ఆదివారం ఉదయం భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు గూగుల్ మీట్ నిర్వహించారు. ఢిల్లీలోని తన నివాసం నుంచి ఇంటర్‌నెట్ ద్వారా ఆయన జిల్లాలోని ప్రింట్‌మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో సుమారు 40 నిమిషాలు మాట్లాడారు. కరోనా పరిస్థితుల్లో ఎలా ఉన్నారంటూ అందరి యోగక్షేమాలను ఆయన ఎంతో ఆత్మయంగా అడిగి తెలుసుకున్నారు. అందరినీ ప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో జర్నలిస్టులు పోరాటయోధులుగా మొదటివరుసలో ఉంటూ ప్రజలను కోవిడ్ వైరస్ పట చైతన్యవంతం చేస్తుండడం అభినందనీయమన్నారు. జిల్లాలో ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన పాత్రికేయుల కుటుంబాలకు తన సానుభూతి తెలపడంతో పాటు కరోనా కారణంగా మృతిచెందిన జర్నలిస్టుల కుటుంబాలకు 50వేల రూపాయల వంతున సాయం అందిస్తానన్నారు. అనంతరం జిల్లాలోని పలు సమస్యలను జర్నలిస్టులు ఉప రాష్ట్రపతి దృష్టికి తెచ్చారు. నెల్లూరు ప్రభుత్వాసుపత్రిలో వసతులు పెంచాలని, ఉద్యానపంటల సమస్యలు తీర్చాలని తదితర అంశాలను జర్నలిస్టులు ప్రస్తావించగా అందుకు స్పందించిన ఉప రాష్ట్రపతి జిల్లా సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆరోగ్యపరిస్థితి గురించి ఉప రాష్ట్రపతి ప్రస్తావిస్తూ ఆయన ఆరోగ్యస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నానని, ఎస్పీ బాలు త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ఈ కరోనా కష్టకాలంలో జిల్లాలోని పాత్రికేయులను, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను ఆత్మీయంగా పలకరించడం తమకెంతో సంతోషంగా ఉందని పాత్రికేయులు ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డక్కన్ క్రానికల్ ప్రతినిధి రాజశేఖర్, సాక్షి టీవీ ప్రతినిధి అమర్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, ఈనాడు ప్రతినిధి సురేష్, ఈ-టీవీ రాజారావు, ఏబీఎన్ ప్రతినిధి మహేష్, 'యాక్ట్' గోవింద స్వామి, ప్రజాశక్తి బాలకృష్ణ, హెచ్ఎంటీవీ నరసింహులు, టీవీ9 మురళి, భారత్ టీవీ ప్రతినిధి మురళి, 'హిందూ' మురళి, 'లాయర్' వారపత్రిక ప్రతినిధి మద్దూరు శ్రీనివాసులు, విశాలాంధ్ర ప్రతినిధి దయాశంకర్ తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో కరోనా విలయతాండవం

- **43,207కు చేరిన కోవిడ్ బాధితులు**
- **446కు చేరుకున్న మృతుల సంఖ్య**

జిల్లాలో కరోనా స్వైరవిహారం చేస్తూనే ఉంది. రోజురోజుకు ఈ వ్యాధి ఉధృతంగా వ్యాపిస్తూనే ఉంది. ఈనెల 10వ తేది గురువారం ఉదయం నాటికి కోవిడ్ బాధితుల సంఖ్య 43,207కు చేరుకుంది. ఈ వ్యాధితో ఇప్పటిదాకా 446 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక్క గురువారం రోజునే 823 మందికి కోవిడ్ పాజిటివ్ రావడంతో ఈ వ్యాధి వ్యాప్తి ఎంతగా విజృంభిస్తోందో అర్థమవుతుంది. అయితే ఇందులో 35,285 మంది కోలుకుని ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి కావడం సంతోషదాయకం. మిగతా వారు వివిధ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. కరోనాను కట్టడి చేసే ప్రయత్నాల్లో భాగంగా జిల్లా అధికారులు పెద్దఎత్తున చర్యలు తీసుకుంటూనే ఉన్నారు. ఇప్పటిదాకా 3,23,639 మందికి పరీక్షలు చేశారు. కరోనా కట్టడికి ప్రజలు సహకరించాలని, స్వీయ నిర్భంధంలో ఉంటూ మాస్కులు ధరించాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని అధికారులు పదేపదే హెచ్చరిస్తూనే ఉన్నారు. ప్రభుత్వ సూచనలు, నియమ నిబంధనలు పాటిస్తూ కరోనాను నియంత్రించేందుకు అన్నివిధాలా ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# చేనేత కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

రాష్ట్రంలో నానాటికి చిక్కిపోతున్న చేనేత కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని బీజేపీ చేనేత సెల్ రాష్ట్ర మాజీఅధ్యక్షుడు కె.ఎస్.చక్రధారి ఈ నెల 9న ఒక ప్రకటనలో ప్రభుత్వాలను కోరాడు. ఎంతో నైపుణ్యంతో వస్త్రాలు నేస్తుంటారని, అయితే వారి శ్రమకు తగ్గ గుర్తింపు ఉండడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వాలు అప్పుడప్పుడూ నేతన్నల సంక్షేమ పథకాల పేరుతో కొంత సాయం చేస్తున్నప్పటికీ ఆ పథకాలు కూడా అసలైన లబ్దిదారులకు చేరడం లేదని, ప్రతి చోటా దళారుల ప్రమేయం వల్ల జిల్లాలో ఎంతోమంది నేతన్నలు ఆ పథకాలను అందుకోలేకపోతున్నారని ఆయన పేర్కొన్నాడు. వ్యవసాయం తర్వాత ఎంతో ప్రాముఖ్యత ఉన్న చేనేత రంగంలో ఉన్న నేత కార్మికులు ఎంతోమంది ఎలాంటి సంక్షేమ పథకాలు అందక జీవనోపాధి కోసం నానా యాతనలు పడుతున్నారని ఆయన పేర్కొన్నాడు. ప్రభుత్వాలు ఇకనైనా చేనేత కార్మికుల అభ్యున్నతికి కృషి చేయాలని జీవనోపాధి కోల్పోయిన నేతకారులకు చేయూతనందించాలని ఆయన కోరాడు. చేనేత పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న చేనేతకారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కేంద్ర చేనేత కార్మికుల బోర్డును కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన సూచించాడు.

వీక్షణం
- మంజీర

## సోషల్ మీడియా!...

# 'నమ్మకం' ఏదయా?..

'ఈనెల 21వ తేదీన స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయింది. పార్టీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధం కావాలి' అంటూ ఒక రాజకీయ పార్టీ ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చినట్లు ఒక పోస్ట్ వాట్సాప్‌లో తిరిగింది. ఈ విషయంలో ఏకంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్వయంగా జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. 'స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎలాంటి నోటిఫికేషన్‌నూ విడుదల చేయలేదని, సోషల్ మీడియా ప్రచారం ఫేక్ అని వివరణ ఇచ్చుకుంది.

పై సంఘటనకు మూడు రోజుల ముందు పంజాబ్‌లో ఓ ఫేక్ వీడియో కలకలం. ఆ ఫేక్ వీడియో చూసి పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్‌కు చిర్రెత్తుకొచ్చింది. ఆ ఫేక్ వీడియోను ప్రచారంలో పెట్టింది ఆప్ (ఆమ్ ఆద్మీ పార్టీ) కార్యకర్తలు. 'వాస్తవాలను వక్రీకరించవద్దని, అవాస్తవాలను ప్రచారంలో పెట్టవద్దని మీ వాళ్లను అదుపులో పెట్టుకో' అని ఆప్ నాయకుడు కేజ్రీవాల్‌ను హెచ్చరించారు అమరీందర్. కెప్టెన్‌కు అంత తీవ్రంగా కోపం రావడానికి, సాటి ముఖ్యమంత్రి అని కూడా చూడకుండా కేజ్రీవాల్‌కు ఉన్న వ్యక్తిగత విశ్వసనీయత స్థాయి దాటి నోరు చేసుకోవడానికి సహేతుకమైన కారణమే ఉంది... 'పంజాబ్ ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వ శాఖ కోవిడ్ మృతుల శరీరాల నుంచి అవయవాలను తొలగిస్తోందని' ఆరోపిస్తూ మార్ఫింగ్ ఫొటోలతో వీడియో చిత్రీకరించి సమాజం మీదకు వదిలారు పంజాబ్ ఆప్ కార్యకర్తలు.

### ఫేక్ ప్రమోషన్

రాజకీయ పార్టీలు... తమ ప్రభుత్వాలు బహు చక్కగా పరిపాలన చేస్తున్నాయని నమ్మబలకడానికి సోషల్ మీడియానే వేదికగా మలుచుకుంటున్నాయి. ఓ రెండేళ్ల కిందట ఒక ఫొటో బాగా వైరల్ అయింది. నిజానికి అది రెండు ఫొటోల కలయిక. మొదటి ఫొటోలో ఒక నిరుపేద కుటుంబం గుడిసె ముందు నిలబడి ఉంటుంది. రెండో ఫొటోలో అదే కుటుంబం పక్కా భవనం ముందు ఉంటుంది. 'మా ప్రభుత్వం ఈ పేద కుటుంబానికి పక్కా ఇల్లు కట్టించి ఇచ్చింది. ఇదీ మా పార్టీ ఘనత. పేదవాడి కోసమే మా పాలన' అంటూ ఆ రాజకీయ పార్టీ నినాదాలు కూడా ఉన్నాయి. అయితే అది నకిలీ ఫొటో అని పదవ తరగతి పిల్లలు కూడా ఇట్టే పట్టేయగలరు. ఆ ఫొటోలో గుడిసె ముందు నిలబడి ఉన్న భార్యాభర్త, నాలుగేళ్ల కూతురు... రెండో ఫొటోలో పక్కా ఇంటి ముందు కూడా అదే దుస్తుల్లో ఉంటారు. ఎంత పేదరికమైతే మాత్రం రెండేళ్ల పాటు అదే దుస్తులు ధరించడం సాధ్యమేనా! పైగా తొలి ఫొటో తీసే నాటికి ఎవరు ఏ దుస్తులు ఎలా ధరించారో వాటిని గుర్తు పెట్టుకుని పక్కా ఇంటి ముందు కూడా ఇదే దుస్తుల్లో ఫొటో దిగుదామని దాచుకుని ఉంటారా! దుస్తులను దాచుకుని వాటినే మళ్లీ ధరించారని సమాధానం చెప్పుకుంటాం సరే! మరి నాలుగేళ్ల పాపాయి రెండేళ్లు గడిచిన తర్వాత ఆరేళ్ల పాపాయిగా ఎదగాలి కదా! అమ్మ పక్కన తొలి ఫొటోలో ఎంత ఎత్తులో ఉందో రెండేళ్ల తర్వాత అని చూపించిన ఫొటోలో కూడా అంతే ఎత్తులో ఉంటుంది. అన్నింటికంటే పెద్ద లోపం ఏమిటంటే... పక్కా ఇంటిని పొందిన ఆనందం ఆ కుటుంబం ముఖంలో మచ్చుకు కూడా కనిపించదు. పేదరికంలో గుడిసె ముందు నిలబడి ఉన్నప్పటి దైన్యమే ఉంటుంది. నకిలీ ప్రమోషన్ కోసం సోషల్ మీడియాను వేదిక చేసుకోవడానికి పరాకాష్ట ఇది.

### దాడికీ ఇదే వేదిక

ప్రభుత్వాల మీద ప్రత్యర్థి పార్టీలు చేసే దాడులు ఒకరకంగా ఉంటే... ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకిస్తూ స్వయం ప్రకటిత మేధావులు చేసే దాడికి వేదిక కూడా సోషల్ మీడియానే అవుతోంది. ప్రధాని మోదీ ఎప్పుడో గుజరాత్‌కు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తన అధికారిక నివాసంలో పేపర్ చదువుతూ ఉంటే పక్కనే రెండుబాతులు కూడా తిరుగుతున్న ఫొటో ఒకటి ఇటీవల వెలుగులోకి వచ్చింది. 'దేశం కరోనాతో కకావికలం అవుతుంటే, జనం భయంతో విలవిల్లాడుతుంటే ప్రధాని మాత్రం ఇలా తోటలో సేద దీరుతున్నాడు' అని ఆడిపోసుకున్నారు నెటిజన్‌లు. అలాగే బంగ్లాదేశ్‌లో ప్రయాణిస్తున్న రైలు ప్రయాణికులతో నిండిపోయి ఉంటుంది. రైలు కిటికీలు పట్టుకుని వేళ్లాడుతూ, రైలుపైన కూడా కూర్చుని ఉన్నారు ప్రయాణికులు. అలాగే మరో ఫొటోలో రైలు గార్డు బోగీ వెనుక ఇనుప పైపు మీద కూర్చుని ప్రయాణిస్తుంటుంది ఒక అమ్మాయి. ఈ ఫొటోలను పోస్ట్ చేసి 'కరోనా కారణంగా జనం సొంతూళ్లకు వెళ్లడానికి ఇలా కష్టాలు పడుతున్నారు. ది గ్రేట్ ఇండియా' అని వ్యంగ్యంగా క్యాప్షన్. ఆ రైలు బోగీల రంగు ఆకారాన్ని పరీక్షగా గమనిస్తే అలాంటి రైలు పెట్టెలు మనదేశంలో ఏ రైల్వే కూడా నడపడం లేదని తెలుస్తుంది. ఆ మాత్రం ఇంగితం ఉన్న వాళ్లు కూడా వ్యూహాత్మకంగా ఈ ప్రచారాన్ని ప్రోత్సహిస్తుంటారు.

### స్వచ్ఛభారత్‌నీ వదల్లేదు

జామ్‌నగర్‌లో బీజేపీ ఎంపీ పూనమ్ ఒక కాలువ మీద నిలబడి మాట్లాడుతూ ఉంటుంది. అంతలోనే ఆమె కాలు కింద ఉన్న సిమెంటు పలక విరిగి ఆమె ఎనిమిది అడుగుల లోతు ఉన్న కాలువలో పడి తీవ్రంగా గాయపడింది. తలకు కుట్లు కూడా పడ్డాయి. మోదీని వ్యతిరేకించే బృందం ఆ వీడియోను సర్క్యులేషన్‌లో పెట్టింది. జామ్‌నగర్‌లో విషయం కదా! ఇక్కడ ఎవరికి తెలుస్తుందిలే అనుకున్నారో ఏమో! 'ఇదీ మన స్వచ్ఛ భారత్' అని గేలి చేస్తూ క్యాప్షన్‌లు పెట్టారు. సామాన్యులను నమ్మించే ప్రయత్నం అది. నిజానికి ఆ సంఘటన స్వచ్‌భారత్ ప్రోగ్రామ్‌కంటే ముందు జరిగింది. జామ్‌నగర్‌లో కొన్ని కాలనీల్లో స్థానికులు రోడ్డు పక్కన స్థలాలను ఆక్రమించుకుని ఇళ్లను విస్తరించుకున్నారు. ఆక్రమణల తొలగింపు కోసం వెళ్లిన మున్సిపల్ అధికారులను తరిమి కొడుతున్నారు. దాంతో ఎంపీ స్వయంగా రంగంలో దిగి స్థానికులకు నచ్చచెబుతున్నప్పుడు చోటు చేసుకున్న ప్రమాదం అది. ఒక నలభై ఏళ్ల మహిళ అభివృద్ధి కోసం ప్రజల పక్షాన ఉంటూనే ప్రభుత్వ కర్తవ్యానికి తోడ్పాటునందిస్తున్నందుకు అభినందించాల్సిన సంగతి.

వీటన్నింటికీ తోడు ఒక ఫొటోను హృదయవిదారకంగా మార్ఫింగ్ చేసి ఈ పాపాయికి ఆపరేషన్ చేయాలి, 'మీరు ఈ వీడియోను షేర్ చేస్తే వాట్సాప్ వాళ్లు షేర్‌కు ఐదు పైసలిస్తారు. వీలయినంత ఎక్కువ మందికి షేర్ చేయండి' అని ఒక యువతి గొంతులో అత్యంత బాధను తొణికిస్తుంది. పొలోమని ఆ వీడియోను షేర్ చేసి తమలోని కారుణ్యానికి మురిసిపోతూ తమ భుజం తామే తట్టుకున్న వాళ్లు ఎందరో. ఈ మధ్య కరోనా టైమ్‌లో ప్లాస్మా దాతల ఫోన్ నంబర్లు అంటూ ఒక జాబితా తిరుగుతోంది. గతంలో ఉచిత వైద్యం అంటూ, కిడ్నీలు ఉన్నాయంటూ కొన్ని నంబర్లు తిరిగాయి. ఆ నంబర్లు పలకవు. ఆ నంబర్లకు ఒకసారి ఫోన్ చేసి క్రాస్‌చెక్ చేసుకుందామనే ఆలోచన ఆ పోస్టులు అంతలా సర్క్యులేట్ అయ్యేవి కాదు.

సామాజిక మాధ్యమమైనా, ప్రధాన స్రవంతి మాధ్యమమైనా సరే... విశ్వసనీయతే వాటికి ప్రాణం. ఆ విశ్వసనీయత కోల్పోతే ఇక మనుగడ కోల్పోయినట్లే. అవాస్తవాల పుట్ట అనే ముద్ర ఒకసారి పడిందంటే దానిని తుడిచి వేయడానికి వందేళ్లు శ్రమించినా ఆ మచ్చ చెరిగిపోదు.

# ప్లాస్మాతో.. నిలుస్తున్న ప్రాణాలు

## జిల్లాలో ఈ విధానం ద్వారా వంద మందికి వైద్యసేవలు

జిల్లాలో కోవిడ్ బాధితులకు ప్లాస్మా థెరపీ ద్వారా దాదాపు వంద మందికి వైద్యసేవలందించారు. జిల్లాలో ఇప్పటి దాకా 372 యూనిట్ల ప్లాస్మాను దాతల నుంచి సేకరించారు. ఈనెల 9న జిల్లా కలెక్టర్ ఆ వివరాలు తెలియజేశారు. ప్లాస్మా థెరపీ ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని, 18 నుంచి 60 సంవత్సరాల వయసున్న వారు ప్లాస్మా దానానికి అర్హులని చెప్పారు. ప్రతి 15రోజులకు ప్లాస్మా దానం చేయవచ్చని, ప్లాస్మాను ఇచ్చిన రెండు గంటల లోపే తిరిగి అది ఉత్పత్తి అవుతుందని తెలిపారు. జిల్లాలో 7 సంజీవని బస్సుల ద్వారా కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, కోవిడ్ అనుమానం ఉన్న ప్రతిఒక్కరూ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని, ఏమాత్రం సూచన లున్నా వెంటనే వైద్యులను సంప్రదించి రోగ తీవ్రతను బట్టి హోం ఐసోలేషన్, లేదా ఆసుపత్రుల్లో చేరాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కోవిడ్ బాధితులకు మొదటి పదిరోజులు అత్యంత కీలకమని, ఏమాత్రం అలక్ష్యం చేయకుండా వెంటనే చికిత్సలు పొందాలని ఆయన సూచించారు. కోవిడ్ కేర్ ఆసుపత్రులు, కోవిడ్ కేర్ సెంటర్లలో బాధితులకు నాణ్యమైన ఆహారాన్ని మూడుపూటలా అందిస్తున్నామని, ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటలూ వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కోవిడ్ నియంత్రణ కోసం నెల్లూరు రెడ్‌క్రాస్ సంస్థ చేస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయమని కలెక్టర్ ఈ సందర్భంగా కొనియాడారు. ప్రజలు స్వీయ నియంత్రణ పాటిస్తూ కోవిడ్ నిరోధానికి ప్రభుత్వం పేర్కొన్న ముందు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో మాప్రా టెక్నాలజీస్ రూపొందించిన ప్లాస్మా ప్లాట్‌ఫాంను ఈ సందర్భంగా కలెక్టర్ తన క్యాంప్ కార్యాలయంలో ప్రారంభించారు. ప్లాస్మా దాతల వివరాలు, కోవిడ్ పేషెంట్ల వివరాలు అన్నీ వెబ్‌సైట్‌లో అందు బాటులో ఉంటాయని తెలిపారు.




## ప్రగతి చారిటీస్‌కు
# వేమిరెడ్డి దంపతుల విరాళం

ప్రముఖ దాత, రాజ్యసభ సభ్యులు, విపిఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు ఈ నెల 9వ తేదీన నెల్లూరులోని ప్రగతి చారిటీస్ స్వచ్ఛంధ సంస్థకు 3లక్షల రూపాయల విరాళాన్ని అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. మానసిక, అంగవైకల్యంతో బాధపడుతున్న చిన్నపిల్లలకు చేయూతనిచ్చేందుకు వారు ఈ మొత్తాన్ని ఆ సంస్థకు అందజేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు మాట్లాడుతూ సమాజంలో అంగవైకల్యంతో బాధపడుతున్న చిన్నారులకు తమవంతు సేవ చేయగలగడం తమకెంతో సంతోషాన్ని కలిగిస్తోందని, గత 13 సంవత్సరాలుగా ప్రతి యేటా తాము ఈ కార్యక్రమం నిర్వహిస్తుండడం తమకెంతో సంతృప్తిని కలిగిస్తోందని అన్నారు.



# స్ఫూర్తి ప్రదాత హనుమారెడ్డి

వైయస్‌ఆర్ పార్టీ నాయకుడు, తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి తమ్ముడు హనుమారెడ్డి ప్లాస్మా దానానికి ముందుకొచ్చి స్ఫూర్తిప్రదాతగా నిలిచాడు. గత శనివారం(5వ తేదీ) ఆయన నెల్లూరు రెడ్‌క్రాస్‌లో ప్లాస్మా దానం చేశాడు. ఒకరి ప్లాస్మా ఇద్దరికి ప్రాణం పోస్తుందని కరోనా నుండి కోలుకున్న వారు, ముఖ్యంగా యువత ముందుకొచ్చి ప్లాస్మా దానం చెయ్యాలని ఈ సందర్భంగా హనుమారెడ్డి పిలుపునిచ్చాడు. సహజంగా 7 పాయింట్ల నుండి 40 పాయింట్ల వరకు యాంటీబాడీస్ కౌంట్ ఉన్నవారి దగ్గర నుండి మాత్రమే ప్లాస్మా స్వీకరిస్తామని హనుమారెడ్డికి యాంటీబాడీస్ కౌంట్ 101.7 పాయింట్లు ఉండడం అరుదైన విషయమని రెడ్‌క్రాస్ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి చెప్పాడు. 'ఒకరి ప్లాస్మా దానం మరో ఇద్దరికి ప్రాణం' అన్న నినాదంతో ముందు కొస్తున్న ప్లాస్మా దాతలకు 'లాయర్' అభినందనలు.



కరోనా బాధితుల కోసం ప్లాస్మా దానం చేసి ఈ నెల 9న జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ప్లాస్మా దాతలు బయ్యా శ్రీనివాసులు, పద్మ నివేదిత

# దయాశంకర్ 'దయా'గుణం



ప్రముఖ పాత్రికేయుడు, 'విశాలాంధ్ర' పత్రిక జిల్లా ప్రతినిధి దయాశంకర్ ఈ నెల 4న ప్లాస్మా దానం చేసి తన దయా గుణాన్ని చాటుకున్నాడు. దయాశంకర్ ఇప్పటికే 67 సార్లు రక్తదానం చేసి వుండడం కూడా ఎంతో విశేషం. సమాజం పట్ల ఆయనకున్న నైతిక బాధ్యతకు ఇది నిదర్శనం. ఇటీవలే కరోనా సోకినప్పటికీ ఆయన ఆ వ్యాధిని జయించి పలు సామాజిక సేవాకార్యక్రమాల్లో పాల్గొంటుండడం అందరికీ ఎంతో స్ఫూర్తిదాయకం.




అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** e-mail: roopagroup@yahoo.com